

నేడే ముగ్గుల పోటీలు

సిద్ధమైన వేదికలు

● ఉదయం 10 గంటల నుంచి



కడపలో: వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, ఐటీఐ దగ్గర
రాయచోటిలో: అర్చన కాలేజీ, ఎగువ అబ్బవరం, గాలివీడు రోడ్డు
రాజంపేటలో: శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్, తాళ్లపాక రోడ్డు

తెలుగు సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో భాగంగా ఆంధ్రజ్యోతి- ఏబీఎన్ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలకు ఉమ్మడి కడప జిల్లాలో వేదికలు సిద్ధమయ్యాయి. ఆదివారం ఉదయం కడప, రాయచోటి, రాజంపేట పట్టణాల్లో పోటీలు జరుగుతాయి. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్టవారి పర్‌ఫెక్ట్, ప్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) సౌజన్యంతో పై మూడు కేంద్రాల్లో ముగ్గుల పోటీలు జరుగుతాయి. **కడప నగరంలో ఐటీఐ దగ్గర వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో, రాయచోటిలో గాలివీడు రోడ్డులోని ఎగువఅబ్బవరం వద్ద ఉన్న అర్చన కాలేజీలో, రాజంపేటలో తాళ్లపాక రోడ్డులోని శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ పోటీలు** నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు పోటీలు ఉంటాయి. పోటీల్లో పాల్గొనదలచిన మహిళలు ఉదయం 9 గంటలకే పోటీలు నిర్వహించే మైదానాల వద్దకు చేరుకొని తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. మైదానాల్లో ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయి. **కడపలో జరిగే పోటీలకు వికాస్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, రాయచోటిలో జరిగే పోటీలకు అర్చన కాలేజీ, రాజంపేటలో జరిగే పోటీలకు శాన్వీ ఇంటర్నేషనల్ స్కూల్ స్పాన్సర్లుగా వ్యవహరిస్తున్నాయి. పోటీలు** జరిగే ప్రతి కేంద్రంలో మొదటి, రెండు, మూడు బహుమతులు ఉంటాయి. వీటితో పాటు కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. ఈ మూడు కేంద్రాల్లో ప్రథమ బహుమతి పొందిన వారి నుంచి జిల్లా విజేతను ఎంపిక చేస్తారు. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల విజేతలు, కర్ణాటక, తమిళనాడు నుంచి ఎంపికైన ఇద్దరు, మొత్తం 15 మందికి జనవరి 11వ తేదిన విజయవాడలో ఫైనల్ పోటీలు ఉంటాయి. ముగ్గుల పోటీల్లో విజేతలను న్యాయ నిర్ణేతలు ఎంపిక చేస్తారు. విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం ఉంటుంది. ఉమ్మడి జిల్లాలోని మూడు కేంద్రాల్లో నిర్వహించే ముగ్గుల పోటీలకు మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్పాన్సర్లు పిలుపునిచ్చారు.



డీఈవో మీనాక్షి వద్దంటూ ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు

డీఈఓ మీనాక్షిని తక్షణం తొలగించాలి

● ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్పష్టీకరణ ● ప్రవీణ్‌ప్రకాశ్ కంటే అధికంగా వేధింపులు

కడప ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డీఈఓ మీనాక్షి తిట్ల పురాణంతో ఉపాధ్యాయుల ఆత్మాభిమానానికి తూట్లు పొడుస్తున్నారనిని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వంలో ఉన్న విద్యాశాఖ కమిషనర్ ప్రవీణ్‌ప్రకాశ్ కంటే అధికంగా జిల్లాలో ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను వేధిస్తున్నారని చెప్పారు. తక్షణం డీఈఓ మీనాక్షిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. డీఈఓ మాకొద్దు అంటూ జిల్లాలోని 27 ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో స్పష్టం చేశారు.

వారు మాట్లాడుతూ డీఈఓగా మీనాక్షి బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకే ఉపాధ్యాయ సంఘాలు ఆమెపై ఆరోపణలు చేస్తున్నారంటే ఆమె ఏ విధంగా ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయులను వేధిస్తున్నారో అధికారులు అర్థం చేసుకోవాలన్నారు. ఇంత వరకు జిల్లాకు వచ్చిన ఏ డీఈఓపై కూడా ఇటువంటి ఆరోపణలు చేసిన దాఖలాలు లేవన్నారు.

జిల్లాలో 6,380 మంది ఉపాధ్యాయులు ఉన్నారని వారి సమస్యల పరిష్కారం కోసం పాఠశాల ముగించుకుని సాయంత్రం 6గంటల తర్వాత డీఈఓ కార్యాలయానికి వస్తే వారిని వేధించడం దుర్భాషలాడడం చేస్తారని ఆరోపించారు. డీఈఓ ఏ పాఠశాలకు తనిఖీ కోసం పోయినా అక్కడ ప్రతి ఒక్కరిని తిట్ల పురాణాలతో వేధిస్తారని చెప్పారు. డీఈఓ మీనాక్షిని తప్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్ జేసీ చాంబర్‌లో జేసీ అదితి సింగ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మైదుకూరు ఉర్దూ జూనియర్ కళాశాల విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం తింటున్న కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

● కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్

మైదుకూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆకాంక్షించారు. శనివారం మైదుకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్‌తో కలసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నేడు రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభమైందన్నారు. ఇప్పటి వరకు ఈ పథకాన్ని 10వతరగతి వరకే అమలు చేస్తున్నారని, సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో నేడు జూనియర్ కళాశాల విద్యార్థులకు సైతం పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సోమవారం నుంచి శనివారం వరకు మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందిస్తామన్నారు. మైదుకూరు జూనియర్ కళాశాలను డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేసేందుకు కృషి చేస్తామన్నారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలు అమ్మాయిలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయని, ఆడపిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉర్దూ కళాశాలకు తగిన వసతులు లేవని, నూతన భవనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి మున్సిపాలిటీలో ఎక్కడైనా ఒక ఎకరం స్థలం కేటాయించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులకు బోజనం వడ్డించి, వారూ అక్కడే భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోహన్, కమిషనర్ శ్రీనివాసుల రెడ్డి, తహశీల్దార్ రాజసింహ, ఎంఈఓ పద్మలత, టీడీపీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, ఆకుల కృష్ణయ్య, పాల మాబు, బీఎన్ శ్రీనివాసులు, కుర్రా రాధ, ధనపాల రవి తదితరులు పాల్గొన్నారు.

భూములకు కచ్చితమైన రికార్డులు ఉండాలి

చాపాడు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల భూములకు కచ్చితమైన రికార్డులు ఉంటే భవిష్యత్తులో బాగుంటుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. బద్రిపల్లెలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో వారు పాల్గొన్నారు. కలెక్టర్ రైతులతో మాట్లాడి వారు ఇచ్చిన అర్జీలు స్వీకరించారు. వారి భూములకు సంబంధించిన రికార్డులను చూసి భూమి ఎలా వచ్చిందని వారిని అడిగి తెలుసుకున్నారు. అర్జీలను పరిష్కరించాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ, తహశీల్దారు రమాకుమారికి కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వేతో వచ్చిన సమస్యలను విస్తీర్ణం మళ్లీ కొలిచి పరిష్కారం చేస్తామన్నారు. పొలాల్లో గట్లు పక్కన ఉన్న ఇతర రైతులుకూడా సహకరించాలన్నారు. 95 శాతం అర్జీలు పరిష్కరించామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో ఇచ్చిన అర్జీలకు రైతులు రశీదు తీసుకోవాలన్నారు. ఆ గ్రామసర్పంచ్ మల్లేశ్వరి, టీడీపీ నాయకులు వీరనారాయణ, గురివిరెడ్డి, కలెక్టర్‌ను, ఎమ్మెల్యేను సన్మానించారు.

మామిడి రైతులకు భారీ నష్టం

● ప్రతికూల వాతావరణ మార్పులే కారణమా ?
● కాయల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
● జిల్లా అంతటా ఇదే పరిస్థితి
● ఆందోళనలో రైతులు

6



కూరగాయాలు

● కూరగాయల పంటలపై తుఫాను దెబ్బ
● ఇప్పటికే తగ్గిన సాగు
● సాగైన పంటల్లోనూ తగ్గిన దిగుబడి
● మండుతున్న ధరలు
● ఏది ముట్టుకున్నా షాకే



కడప రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): వరుస తుఫానుల తాకిడికి కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఒక్క డిసెంబరు నెలలోనే ఒకదాని తరువాత ఒకటి వరుసగా మూడు తుఫానులు రావడంతో రోజుల తరబడి ముసురువానలు కురిశాయి. వీటి ప్రభావంతో జిల్లాలో కూరగాయల దిగుబడులు గణనీయంగా తగ్గాయి. దీనికి తోడు కూరగాయల సాగుకూడా తగ్గింది. ఫలితంగా ప్రజల అవసరాలకు సరిపడా కూరగాయలు అందుబాటులోకి రావడంలేదు. ఇదే అనువుగా వ్యాపారులు ధరలను పెంచేశారు. ఈ ప్రభావం రైతుబజార్లపై పడి అక్కడ కూడా ధరలు పెరిగాయి. వేసవి సీజన్ ప్రారంభం కాకమునుపే ఇలా ఉంటే వేసవిలో కూరగాయల ధరలు ఇంకెలా ఉంటాయోనని వినియోగదారులు బెంబేలు చెందుతున్నారు. ఏదీ కొనలేని.. తినలేని పరిస్థితి దాపురించిందని వాపోతున్నారు. ముసురు వానలతో దాదాపు 40 శాతం దిగుబడులు తగ్గిపోవడంతో కూరగాయలకు గిరాకీ బాగా పెరిగిపోయింది. పచ్చిమిర్చి, వంకాయ, బెండకాయ, బీరకాయ, మటిక్కాయ, చిక్కుడుకాయ, కాకరకాయ కాదేదీ ధరల పెరుగుదలకనర్హం అన్నట్లుంది. వారానికి సరపడ కూరగాయలు కొనాలంటే దాదాపు రూ.800ల వరకు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. టమోటా మినహాయిస్తే ప్రతి కూరగాయ ధరా ఆకాశాన్నంటుతోంది.

నియంత్రణకు కానరాని చర్యలు

జిల్లాలో టమోట, పచ్చిమిరప, వంకాయ, బెండ, మటిక్కాయ, బీర, కాకర తదితర కూరగాయలను రైతులు పండిస్తున్నారు. ఈ పంటలపై తుఫాను ప్రభావంతో దిగుబడి బాగా తగ్గిపోయింది. వీటితో పాటు బీన్స్, క్యాబేజీ, క్యారెట్, బీట్‌రూట్, బీర, చిక్కుడు వంటి కూరగాయలన్నీ ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి అవుతున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడంతో ధరలు బాగా పెరుగుతున్నాయి. గతంలో జిల్లా నుంచి అన్నిరకాల కూరగాయలు లోకల్ మార్కెట్లకు వచ్చేవి. ఇందుకు భిన్నంగా దిగుమతి చేసుకోవాల్సి రావడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ధరల పోటు తప్పడం లేదు. మార్కెట్, ఉద్యానశాఖల అధికారులు ముందుచూపు లేకపోవడంతో జిల్లాలో కూరగాయల సాగు తగ్గుముఖం పట్టినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొరత ఏర్పడకుండా ఉద్యానశాఖ అధికారులు తగిన చొరవతీసుకోవాలి. బావులు, బోర్లు ఇతర నీటి పారుదల కింద కూరగాయల సాగును ప్రోత్సహించాలి. ఇందుకోసం సబ్సిడీపై విత్తనాలను రైతులకు పంపిణీచేయాల్సి ఉంది. ఇవేమి చేయకపోవడంతో సాగు తగ్గడం కూడా కూరగాయల ధరల పెరుగుదలకు కారణమని అంటున్నారు. ధరలు పెరుగుతున్న సందదర్భంలో మార్కెటింగ్‌శాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సి ఉంది. కూరగాయలు బాగా పండే ప్రాంతాల నుంచి తెప్పించి తక్కువ ధరలకు రైతుబజార్ల ద్వారా పంపిణీ చేయించాలి. ఆ దిశగా జిల్లాలో ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని సామాన్య జనం వాపోతున్నారు.

మండుతున్న ధరలు

జిల్లాలోని ఆయా మార్కెట్లలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. బీన్సు, క్యాప్సికమ్, చామగడ్డ ధరలు సెంచరీకి చేరువలో ఉన్నాయి. బీట్రూట్ కిలో రూ.65, క్యారెట్ రూ.80, అనపకాయ రూ.60, మునగకాయ రూ.60, బజ్జీమిరపకాయ రూ.55, మటిక్కాయ రూ.50, చిక్కుడుకాయ రూ.60 పలుకుతున్నాయి. క్యాలీఫ్లవర్ రూ.45, కాకరకాయ రూ.60, బంగాళదుంప రూ.50, ముల్లంగి రూ.40, పచ్చిమిర్చి రూ.50, వంకాయ రూ.50, బెండకాయ రూ.40, బీరకాయ రూ.40, క్యాబేజి రూ.30 ఉన్నాయి. ఒక్క టమోటా మాత్రమే కిలో రూ.15కు దొరుకుతున్నాయి. బెంగళూరు నుంచి దిగుమతి అయ్యే ప్రతికూరగాయ ధరా ఆకాశాన్ని అంటుతుండటంతో వీటి కొనుగోలుకు వినియోగదారులు హడలెత్తుతున్నారు. డిమాండ్‌కు తగిన సరఫరా లేకపోవడంతో బీన్స్ క్యాలిఫ్లవర్, చిక్కుళ్ల ధరలు చుక్కలనంటుతున్నాయి.

రేపటి నుంచి ఆరోగ్య పింఛన్ల ధ్రువీకరణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పింఛన్ల ధ్రువీకరణ కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్టీఆర్ పింఛన్ స్కీం ద్వారా జిల్లాలో 931 మంది పూర్తి వైకల్యం ఉన్నట్లు ప్రతి నెల రూ.15వేలు పింఛన్ పొందుతున్నారు. ఈ పింఛన్ల ధ్రువీకరణ కోసం ఒక కమిటీని రూపొందించారు. స్పెషలిస్ట్ డాక్టర్‌తో పాటు ఒక ఆర్థోపెడిక్ ఒక జనరల్ ఫిజీషియన్, సంబంధిత ఏరియా మెడికల్ ఆఫీసర్లతో ఒక టీంగా ఏర్పాటుచేశారు. ఈ బృందం ప్రతిరోజు 25 మంది పింఛన్‌దారులను ధ్రువీకరిస్తుంది. షెడ్యూల్ ప్రకారం సంబంధిత పచాయతీ కార్యదర్శులు పింఛన్‌దారులకు నోటీసులు ఇస్తారు. నోటీసును తిరస్కరించినా, ధ్రువీకరణకు హాజరుకాక పోయినా వారి పింఛన్ హోల్డ్‌లో ఉంచుతారు. జిల్లాలో సోమవారం నుంచి బృందాలు ధ్రువీకరణ చేయనున్నాయి. ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల్లో 6వ తేదీన, అట్లూరు బద్వేలు 7వ తేదీన, గోపవరం, బికోడూరు 8వ తేదీ, పోరుమామిళ్ల 16వ తేదీ, కలసపాడు 17వ తేదీ, కాశినాయన మండలం 18వ తేదీ, బి.మఠం మండలం 20, మైదుకూరు, చాపాడు మండలాలు 21, దువ్వూరు మండలంలో 22వ తేదీన ఒక బృందం అధికారులు ధ్రువీకరణ పత్రాలను, పింఛన్‌దారులను పరిశీలిస్తారు. అదేవిధంగా మరో బృందం అధికారులు 6, 7, 8, 16 తేదీలలో పెద్దముడియం, జమ్మలమడుగు, మైలవరం మండలాల్లో ధ్రువీకరిస్తారు. మరో బృందం అధికారులు 6వ తేదీన ఎర్రగుంట్ల, 7, 8, 16 తేదీలలో కమలాపురం, వల్లూరు మండలాల్లో 17, 18 తేదీలలో, ఖాజీపేట, చెన్నూరు మండలాలు 20, 21 కడప అర్బన్ 22, 27, 28 తేదీలలో, సీకే దిన్నె, పెండ్లిమర్రి మండలాల్లో పరిశీలిస్తారు. మరో టీం లోని అధికారులు 6, 7, 8 తేదీలలో చక్రాయపేట, వేంపల్లె, వేముల మండలాల్లో, 16, 17, 18, 20 తేదీలలో తొండూరు, సింహాద్రిపురం, లింగాల మండలాల్లో, 21, 22 తేదీలలో పులివెందుల, 27న వీఎన్‌పల్లె మండలాల్లో ధ్రువీకరణ కార్యక్రమం చేపట్టనున్నారు.



అవినీతి వెలుగు చూసేనా..!

● ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా జరిగేనా..? 6

7న జిల్లా స్థాయి రంగోత్సవ్ వేడుకలు

6

ఆగని 'రేషన్' దందా

● డీలర్ల నుంచే మాఫియాకు రవాణా అవుతున్న సరుకు
● డీలర్లపై కొరవడిన ఎన్‌ఫోర్స్‌మెంట్ నిఘా

ప్రొద్దుటూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రేషన్ బియ్యం అక్రమ దందా ఆగటం లేదు. శుక్రవారం ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ ఆటోనగర్‌లోని ఓ ప్రైవేటు గౌడౌన్‌లో 184 బస్తాల రేషన్ బియ్యాన్ని తహశీల్దారు గంగయ్య ఆధ్వర్యంలో సీజ్ చేశారు. గత నవంబరు, డిసెంబరు నెలల్లోనే వందలాది రేషన్ బియ్యం బస్తాలను, లారీల లోడులను సైతం రెవెన్యూ, పోలీసులు పట్టుకున్నారు. వరుసగా రేషన్ బియ్యం పట్టుబడటం చూస్తుంటే వైసీపీ ప్రభుత్వంలో లాగానే కూటమి ప్రభుత్వంలో కూడా రేషన్ మాఫియా రెచ్చిపోతోందన్న విషయం స్పష్టమవుతోంది. ఒకవైపు రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ దందాపై ఉపముఖ్యమంతి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో కఠిన చర్యలు ప్రారంభించినప్పటికి కడప జిల్లాలో మాత్రం రేషన్ మాఫియా లెక్కచేయడం లేదు.



ఆటోనగర్‌లో శుక్రవారం పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న తహశీల్దారు గంగయ్య

డీలర్ల వద్ద నుంచే రవాణా అవుతున్న సరుకు

ప్రొద్దుటూరులో రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లే కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి వాటిని వ్యాపారులకు విక్రయిస్తున్నారు. మరికొందరు కార్డుదారులు బియ్యం తీసుకుని తమ ఇళ్లవద్దకు వచ్చే రేషన్ బియ్యం వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. చాలావరకు డీలర్లు నెల సరుకు సక్రమంగా పంచుతున్నారా లేదా.. అని అధికారులు నిఘా పెట్టడం లేదు. అందువల్ల డీలర్లు నేరుగా కార్డుదారుల నుంచి బియ్యం కొనుగోలు చేసి తమ రేషన్ షాపుల్లో పెట్టకుండా పక్కన ప్రైవేటు గదులలో నిల్వ ఉంచి వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇలా ప్రతినెలా దాదాపు కోట్ల రూపాయల బియ్యం ఎల్లలు దాటుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాజకీయ నేతల జోక్యం

రేషన్ బియ్యం అక్రమ రవాణా జరగకుండా రెవెన్యూ, సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంటు నిఘా పెట్టి పట్టుకుంటే.. వెంటనే రాజకీయ పెద్దల నుంచి ఫోన్లు వస్తాయని అధికారులు వెల్లడిస్తున్నారు. డీలర్లలో చాలావరకు అధికార, ప్రతిపక్ష పార్టీ కార్యకర్తలుండటం వలన ఈ పరిస్థితి నెలకొంటోంది. కేవలం రేషన్ పంపిణీ ద్వారా వచ్చే కమీషన్ కోసం పనిచేస్తే అప్పుల పాలవుతామని, కొన్ని బస్తాల బియ్యం అమ్ముకోకుంటే రేషన్‌దుకాణాలకు అద్దెలు సైతం చెల్లించలేమని డీలర్లు చెబుతున్నారు.



మండిబజార్‌లో ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం

వరుసగా పట్టుబడుతున్నా..

రేషన్ బియ్యం అక్రమ రవాణా సాగుతూ తరుచూ పట్టుబడుతున్నా రేషన్ మాఫియాపై అధికారులు పీడీ యాక్ట్ పెట్టకపోవడంతో వారు భయపడ్డం లేదనే ప్రచారం సాగుతోంది. ప్రభుత్వం ఒకవైపు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించినా యథేచ్ఛగా అక్రమ దందా సాగడం వెనుక కేసులు పెట్టి కఠినంగా వ్యవహరించక పోవడమే కారణం అంటున్నారు. ఇప్పటికైనా జిల్లాలో రేషన్ బియ్యం అక్రమదందాకు అధికారులు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

● జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్న జేసీ ఆదర్శ్‌రాజేంద్రన్

రాయచోటిటౌన్, జనవరి4(ఆంధ్రజ్యోతి): విద్యా ప్రమాణాల మెరుగునకు, విద్యార్థుల్లో సృజనాత్మకతకు నాణ్యమైన భోజనమే పునాది అని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత విద్యాశాఖలో పెనుమార్పులు వచ్చాయని, అందులో భాగంగానే జూనియర్ కళాశాల విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించేందుకు తిరిగి భోజన పథకాన్ని ప్రారంభించారన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు బాగా చదువుకోవాలంటే నాణ్యమైన భోజనం ఎంతో అవసరమన్నారు. వారంలో ఆరు రోజుల పాటు ఈ భోజన పథకాన్ని అమలు చేస్తున్నామన్నారు. దీంతో పాటు రాగిజావ కూడా అందించబడు తుందన్నారు. రాయలసీమ, కోస్తా, ఆంధ్ర తదితర ప్రాంతాల పిల్లలు తినే విధంగా అక్కడి పరిస్థితులు బట్టి భోజనాలను తయారు చేస్తున్నారన్నారు. తాను చదువుకునేటప్పుడు ఇంటి నుంచి భోజనాన్ని తీసుకువచ్చే వాడినని, అటువంటి ఇబ్బందులు ఏమీ లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని జూనియర్ కళాశాల విద్యార్థుల స్థాయి వరకు అందిస్తోందన్నారు. ఈ పథకాన్ని విద్యా ర్థులు ఉపయోగించుకొని బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షిం చారు. కాగా జేసీ విద్యార్థులకు స్వయంగా భోజనాన్ని వడ్డించి అనంతరం కళాశాలలోనే భోజనం చేశారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ అధికారి కృష్ణయ్య, జిల్లా విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

7న జిల్లా స్థాయి రంగోత్సవ్ వేడుకలు

రాయచోటిటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలోని డైట్ కళాశాలలో ఈ నెల 7న ఉమ్మడి కడప జిల్లా స్థాయి రంగోత్సవ్ (2024-25) సంబరాలు ఉంటాయని డైట్ ప్రిన్సిపాల్ అజయ్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగోత్సవ్ సాంస్కృతిక, సృజనాత్మక పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడమే కాకుండా వారి సాంస్కృతిక భావనను ప్రోత్సహించడంలో కీలకపాత్ర పోషిస్తామన్నారు. ఈ పోటీలకు సంబంధించి సమాచారం కోసం ప్రోగ్రాం కోఆర్డినేటర్ వైసీ రెడ్డెప్పరెడ్డి (8008215541), కె.దేవి లెక్చరర్ (9441228359)ను సంప్రదించాలన్నారు. రంగోత్సవ్ (2024-25) సంబరాల్లో ప్రధానంగా 8 విభాగాల్లో పోటీలు నిర్వహించబడతాయని, క్విజ్ పోటీలు, చిత్రలేఖనం, హస్తప్రతిలిపి, రంగోలి, డిజిటల్ కలాజ్, స్లోగస్ రచన, రోల్‌పే పోటీలు ఉంటాయన్నారు. ఏపీలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీకి 1 గంట ముందు హాజరుకావాలని, అవసరమైన పరికరాలు, సామగ్రి విద్యార్థులే తెచ్చుకోవాలన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ట్రోఫీలతో పాటు సర్టిఫికెట్స్ కూడా ఇస్తామన్నారు. ప్రతి డైట్ స్థాయిలో మొదటి, రెండవ, మూడు బహుమతి విజేతలు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు. డైట్ స్థాయి పోటీల అనంతరం జిల్లా స్థాయి పోటీలు జనవరి 8న ఉంటాయని, ఆసక్తి గల పూర్వపు కడప జిల్లా (అన్నమయ్య, కడప)లోని విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొనవచ్చని ఆయన తెలియజేశారు.

ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు మృతి

లింగాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నూతలపల్లెలో లోమడ గురుడు (18) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. గురుడు తండ్రి సూర్యుడు, పోలీసుల కథనం మేరకు... డిసెంబరు 31న రాత్రి నూతన సంవత్సర వేడుకల్లో గురుడును అదే గ్రామానికి చెందిన కొందరు దూషించిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో మృతుడు మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. ఈ మేరకు కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

11 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న తమిళనాడుకు చెందిన ఒక స్మగ్లరును పట్టుకోవడమే కాకుండా ఒక వాహనం, 11 దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు అటవీ శాఖ ఫ్లయింగ్ స్క్వాడ్ పీలేరు డీఎఫ్‌వో గురుప్రభాకర్ శనివారం తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతోందన్న సమాచారంతో తాము శనివారం ఉదయం చిత్తూరు జిల్లా పులిచెర్ల వద్ద వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. ఆ సమయంలో వేగంగా వచ్చిన ఏపీ03 ఏఎం 9009 హోండా సీటీ కారును ఆపినా ఆపకుండా మంగళంపేట వైపు వెళ్లిపోయిందన్నారు. దాన్ని వెంబడించగా అందులో ఉన్న వ్యక్తులు కారును వదిలి పారిపోయే ప్రయత్నం చేశారన్నారు. కానీ తమిళనాడు రాష్ట్రం, విల్లాపురానికి చెందిన ఎ.సతీశ్(22) అనే స్మగ్లర్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం కారును పరిశీలించగా అందులో 320 కిలోల బరువున్న ఎర్రచందనం దుంగలు ఉన్నాయని, కేసు నమోదు చేశామన్నారు. పారిపోయిన వారి కోసం గాలింపు ముమ్మరం చేశామన్నారు. ఈ దాడిలో ఎఫ్‌ఆర్‌వో చంద్రశేఖర్, ఎఫ్‌బీవో ప్రతాప్, సిబ్బంది పాల్గొన్నట్లు వివరించారు.

మామిడి రైతులకు భారీ నష్టం

● ప్రతికూల వాతావరణ మార్పులే కారణమా ?
● కాయల కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు
● జిల్లా అంతటా ఇదే పరిస్థితి
● ఆందోళనలో రైతులు



ఈటమాపురం వద్ద ఇంకా పూతకు రాని మామిడి తోట

పెనగలూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఈ యేడు ప్రతికూల వాతావరణ మార్పులతో మామిడి రైతులకు భారీ నష్టం సంభవించవచ్చని రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల సీజన్ ముగిసి తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గ వస్తున్న లక్షణాలు కూడా కనిపించ లేదని వాపోతున్నారు. దీంతో కాయల కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉందని ఉద్యానశాఖ అధికారులు చెబుతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

ఎన్నో ఆశలతో పంటను సాగు చేస్తారు. పంట దిగుబడి బాగా వస్తే చేసిన అప్పులు తీర్చేద్దామనుకుంటారు. కానీ పంట చేతికొచ్చే వరకు ఏ ముప్పు ఎటునుంచి వస్తుందో తెలియదు. ఇప్పుడు ఇదే పరిస్థితి మామిడి రైతుల్లో కనిపిస్తోంది. ప్రతికూల వాతావరణ మార్పుల కారణంగా మామిడి పంట దెబ్బతింది. తోటలు పూతలతో కళకళలాడాల్సిన సమయంలో కాండానికి మొగ్గలు రాక దిగాలు చెందుతున్నారు. నవంబరు ముగిసిన సమయానికి మొగ్గలు రావడానికి క్రిమిసింహారక మందులను పిచికారి చేయాల్సి ఉంది. అలాగే డిసెంబరు వారంలోనూ, జనవరి 1, 2 వారాల్లో మొగ్గలు విచ్చిన పూతకు పురుగు పట్టకుండా మందు పిచికారి చేయాల్సి ఉంది. ఈ ఏడు భిన్నమైన ప్రతికూల వాతావరణంతో మొగ్గ, పూత దశలో చేయాల్సిన 2 సార్లు పిచికారి పనులు రైతులు నిలిపివేశారు. వాతావరణం అన్ని విధాలుగా అనుకూలంగా ఉంటే ఇంకో 20 రోజుల తర్వాత మందులు పిచికారీ చేయాలని రైతులు బావిస్తున్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితులు గత మూడేళ్ల నుంచి తోటల్లో కాయలు కాయక మామిడి రైతులు నష్టపోతూనే ఉన్నారని, ఈ ఏడు కూడా అదే పరిస్థితి దాపురిస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. గత మూడేళ్ల నుంచి రైతులు మామిడి తోటలకు సేద్యపు పనులు, ఎరువుల తోలకం, సస్యరక్షణ చర్యలు తదితర సేద్యపు ఖర్చులకు భారీగా పెట్టుబడులు పెట్టుకుంటూ వస్తున్నారు. గత రెండేళ్ల నుంచి నష్టాలను చవిచూస్తున్న రైతులు ఈ ఏడు కూడా అదే పరిస్థితి ఎదురైతే ఎలా అని ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది కూడా కాయలు కాయకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు.



మొగ్గలైనా కనిపించని ఖాదర్ రకం చెట్టు

ఐదేళ్లుగా నష్టాలను చవిచూస్తున్నాం

\- రెడ్డెయ్య, రైతు, ఎగువ సిద్దవరం



నాకు 10 ఎకరాల మామిడి తోట ఉంది. ప్రతి ఏడు తోటలకు సస్యరక్షణ చర్యలు, ఎరువుల వాడకం, సేద్యపు పనుల కోసం ఎకరాకు రూ.లక్ష ఖర్చు వస్తోంది. ఐదేళ్లకు మునుపు ఎకరాకు 5 టన్నుల కాయలు దిగుబడి వచ్చేది. గత నాలుగేళ్ల నుంచి దిగుబడి బాగా పడిపోయి ఎకరాకు కనీసం రెండు టన్నుల కాయలు కాయడం రావడం లేదు. ఏ ఏడాది పరిస్థితి చూస్తే భయమేస్తోంది. కనీసం సేద్యపు ఖర్చులు అయినా వస్తాయో రావో అని ఆందోళనగా ఉంది.

జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి

\- సురేష్‌బాబు, ఉద్యానశాఖ అధికారి, రాజంపేట డివిజన్



జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో 35,863 హెక్టార్లలో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. ఫిబ్రవరి నెల నుంచి పొడి వాతావరణం ఏర్పడినప్పుడు పూత, పిందె బాగా ఏర్పడుతుంది. మామిడిలో సస్యరక్షణ చర్యలు గురించి ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించాం. డిసెంబరు నెలాఖరు వరకు హెక్టారుకు రూ.2250తో క్రాప్ ఇన్సూరెన్స్ చేయించాం. ఒకవేళ రైతులకు ఏదైనా నష్టం జరిగితే ప్రభుత్వం రూ.45 వేలు పరిహారం ఇస్తుంది. చాలామంది రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయారు.

వ్యాపారులు మొగ్గు చూపడం లేదు

\- రవికుమార్, వ్యాపారి, ఈటమాపురం



తోటల్లో మొగ్గలు, పూత పుష్కలంగా కనిపిస్తున్నప్పుడు వ్యాపారులు పిందె, కాయలను అంచనా వేసి ముందుగానే తోటలపై పెట్టుబడి పెట్టేవారు. గత రెండేళ్ల నుంచి ఆ పరిస్థితి లేదు. అంచనాలు తలకిందులు అయితే భారీ నష్టాలను చవిచూడాల్సి వస్తుంది. అందువల్ల వ్యాపారులు ముందస్తుగా కొనుగోలుకు మొగ్గు చూపడం లేదు. మాకు దిక్కుతోచడం లేదు.

పకడ్బందీగా కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలు

● పర్యవేక్షించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



ఎంపికలను పర్యవేక్షిస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

కడప క్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కడప జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు నగర శివార్లలోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో దేహదారుఢ్య పరీక్షలను ఐదో రోజు శనివారం కడప ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు కానిస్టేబుల్ ప్రిలిమనరీ పరీక్షను పూర్తి చేసిన అభ్యర్థులకు ఫిజికల్ మెజర్‌మెంటు, ఫిజికల్ ఎఫీషియన్సీ టెస్టులకు ఉమ్మడి జిల్లాలో 4492 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారన్నారు. ఐదోరోజు శనివారం 600 మంది అభ్యర్థులకు గాను 373 మంది పరీక్షలకు హాజరు కాగా, 229 మంది క్వాలిఫై అయ్యారన్నారు. దేహదారుఢ్య పరీక్షల వద్ద ఎక్కడా ఎలాంటి ఆరోపణలు, పొరపాట్లకు తావు లేకుండా ఆధునిక ఆర్‌ఎఫ్‌ఐడీ కంప్యూటరైజ్డ్ టెక్నాలజీతో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్‌బాబు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ రమణయ్య, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఐటీ కోర్ టీం, డీపీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

● కొడవలి, చాకు, కర్రలతో దాడి ● ఇరువురికి గాయాలు

మదనపల్లె అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంలో ఇరువర్గాల ఘర్షణలో ఇరువురు గాయపడిన సంఘటన శనివారం రెడ్డివారిపల్లె పంచాయతీలో చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. గ్రామంలో భూ విషయంగా గతంలో మరొకరికి సాక్ష్యం చెప్పామనే నెపంతో నిమ్మనపల్లె మండలం, రెడ్డివారిపల్లె పంచాయతీ, దిన్నేపల్లెలో కోర్టు తీర్పు వచ్చిన భూమిలో వ్యతిరేక వర్గీయులు ట్రాక్టర్‌తో దున్నే ప్రయత్నం చేశారు. దీంతో అక్కడికి వెళ్లి అడ్డుకున్న వారిని కర్రలతో కొట్టి చాకుతో చేతిపై పొడిచారని, ట్రాక్టర్‌తో తొక్కిస్తామని బెదిరించారని ఆరోపించారు. ఈ ఘర్షణలో గాయపడిన వారిని కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు రవిబాబు, శ్రీరాములు కుటుంబసభ్యులు నిమ్మనపల్లె పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా ఈ విషయమై నిమ్మనపల్లె హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తిని వివరణ కోరగా.. బాధితుల ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని, కేసు నమోదు చేయలేదన్నారు.

రామాలయంలో విజిలెన్స్ విచారణ

ఒంటిమిట్ట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర అయోధ్యగా పేరు గాంచిన కోదండరామాలయంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో భాగంగా మిగిలిపోయిన ఇనుప రేకులు, ఇనుప వస్తువులు, ఇతర సామాన్లు మాయం చేశారన్న ఫిర్యాదుపై టీటీడీ విజిలెన్స్ ఎస్‌ఐ విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో కోదండరామాలయంలో శనివారం విచారణ చేపట్టారు. కాంట్రాక్టర్ వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు.. సౌమ్యనాథస్వామి ఆలయం, దేవునికడప, తాళ్లపాకలో అనుమతులు లేకుండా పనులు చేయకుండానే బిల్లులు తీసుకున్నారని ఇంజనీరింగ్ అధికారులపై విజిలెన్స్ అధికారులు ఫిర్యాదు చేశారు. దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. సౌమ్యనాథస్వామి ఆలయం ధ్వజస్తంభం మార్పిడి చేయకుండానే మార్చినట్లుగా బిల్లులు చెల్లించారని క్షేత్రస్థాయిలో నిర్ధారణకు వచ్చారు. రామాలయంలో ఇనుప వస్తువులను ఇంజనీరింగ్ అధికారులు తరలించారని అప్పటి కాంట్రాక్టర్‌లు అధికారులను వివరించారు. తుది నివేదికను టీటీడీ విజిలెన్స్ అధికారులకు అందజేస్తామని టీటీడీ విజిలెన్స్ అధికారులు తెలిపారు.

కడుపునొప్పి తాళలేక బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య



మృతిచెందిన రెడ్డిజ్యోతి

నిమ్మనపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి తాళలేక గ్రామ సమీపంలోని బావిలోకి దూకి మహిళ ఆత్మహత్య చేసుకొన్న సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకొంది. కొండయ్యగారిపల్లి పంచాయతీ కొమ్మిరెడ్డిగారిపల్లికి చెందిన శివారిపల్లి రెడ్డిజ్యోతి(25)ని వాల్మీకిపురం మండలం పత్తేపురానికి చెందిన తన మేన మామ కిరణ్‌కుమార్‌తో ఎనిమిదేళ్ల క్రితం వివాహం జరిగింది. అయితే రెడ్డిజ్యోతి తన పుట్టిళ్లు అయిన కొమ్మిరెడ్డిగారిపల్లికి రెండు రోజుల క్రితం వచ్చింది. కాగా శనివారం ఉదయం కడుపునొప్పి ఎక్కువ కావడంతో ఆ నొప్పిని భరించలేక సమీపంలో వున్న వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కాగా మృతురాలికి ఒక కుమారుడు వున్నాడు. మృతురాలి తల్లి రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు మృతదేహన్ని పోస్టుమార్టం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ జిలానీబాషా తెలిపారు.

అవినీతి వెలుగు చూసేనా...!

● బినామీ పేర్లు బయటకు వచ్చేది ఎప్పుడు ? ● సామాజిక తనిఖీ నిష్పక్షపాతంగా జరిగేనా..?



గుర్రంకొండలో ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీలు (ఫైల్‌ఫొటో)

గుర్రంకొండ, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనుల్లో సామాజిక తనికీ బృందం అవినీతిని వెలికితీయగలరా అన్న చర్చ మండల ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. ఉపాధిహామీ పథకంలో ఏడాదిపాటు జరిగిన పనులపై సామాజిక తనికీ బృందం తనిఖీలు చేయనుంది. ఈ క్రమంలో గుర్రంకొండ మండలంలో ఉపాధిహామీ పథకంలో జరిగిన వివిధ పనుల్లో పెద్ద ఎత్తున అవినీతి, అక్రమాలు జరిగినట్లు కూలీలు, ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధిహామీ పథకంలో చేసిన పనులపై సామాజిక తనిఖీ బృందం వారం రోజుల పాటు కూలీలు చేసిన ప్రతి పనిని తనిఖీ చేయనుంది. ఈ తనిఖీ బృందం నిష్పక్షపాతంగా చేస్తే లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్ము రికవరీ అవుతుందని నాయకులు, కూలీలు, ప్రజలు ఎదురుచూస్తున్నారు.

గుర్రంకొండ మండలంలో 15 పంచాయితీలున్నాయి. ఈ పంచాయతీలో ఉపాధిహామీ పథకంలో 2023 ఏప్రిల్ 1వ తేది నుంచి 2024 మార్చి 30వ తేది వరకు జరిగిన వివిధ పనులను సామాజిక తనికీ బృందం తనిఖీ చేయనుంది. ఈ ఏడాది పాటు కూలీలు చేసిన పనులకు రూ.5.22 కోట్లు, మెటీరియల్ పనులకు గానూ రూ.2.50 కోట్లు మొత్తం రూ.7.77 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో చానల్ పనులు, ఫారంపాండ్లు, సచివాలయాల నిర్మాణం, ఆర్బీకేలు, డ్రైన్లు, సీసీరోడ్లు, నాడు-నేడు, చెరువుల పూడికతీత పనులను చేశారు. ఈ పనులను కొందరు వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని ఇష్టానుసారంగా చేశారు. ఈ క్రమంలో ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలు అధికంగా జరిగినట్లు టీడీపీ నాయకులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇందులో భాగంగా శనివారం సామాజిక తనిఖీ బృందం సభ్యులతో కలిసి ఉపాధి సిబ్బందికి కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆదివారం నుంచి సామాజిక తనిఖీ బృందం గ్రామాల్లో పర్యటించి ఉపాధిహామీ పనులను తనిఖీ చేయనుంది.

10 మందికి.. మరో ఐదుగురు

ఉపాధిహామీ పథకంలో పనులు చేసే కూలీలకు ప్రతి రోజు మస్టర్‌ను వేస్తారు. ఈ మస్టర్‌ను పని ప్రదేశంలో కూలీల పేర్లను నమోదు చేసి అటెండెన్స్ వేస్తారు. మస్టర్‌లో కూలీల పేర్లను పూర్తి చేసిన తరువాత ఖాళీ ప్రదేశంలో పనిచేయని కూలీల పేర్లను ఫీల్డ్ అసిస్టెంట్లు వారంలో చివర రోజున బినామీ పేర్లను నమోదు చేస్తారు. ఈ క్రమంలో పని చేయని కూలీల పేర్లను ఐదు నుంచి పది మంది పేర్లను మస్టర్‌లో చేర్చి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకున్నారు. ఇలా మండలంలో కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు, వైసీపీ నాయకులు కలిసి ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకొన్నారు. ఈ నేపథ్యంలో మస్టర్లలో బినామీ పేర్లతో సిబ్బంది, నాయకులు లక్షలు గడించారు. సామాజిక తనిఖీ బృందం క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలిస్తే అవినీతి బయటకు వస్తుందని కూలీలు గుసగుసలాడుతున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి అక్రమాలను వెలికితీస్తాం

ఉపాధిహామీ పథకంలో వివిధ పనులను క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలిస్తాం. ప్రతి కూలీతో మాట్లాడి పనులు చేసిన తీరును ఆరాతీస్తాం. అలాగే మస్టర్లలో బినామీ పేర్ల విషయంలో క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో పరిశీలిస్తాం. ఉపాధిహామీ పథకంలో అవినీతి, అక్రమాలను వెలికి తీసేందుకు సామాజిక తనిఖీ బృందం పనిచేస్తుంది.

-సుబ్బారావు, ఎస్ఆర్పీ, సామాజిక తనిఖీ బృందం సభ్యులు

బావబామ్మర్దుల మధ్య ఘర్షణ

● ఒకరి కత్తిపోటు ● పరిస్థితి విషమం



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహబూబ్‌బాషా

కడపక్రైం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప నగరం రెండో గాంధీబొమ్మ వద్ద బైకు తాళం విషయమై బావబామ్మర్దులు పరస్పరం ఘర్షణ పడ్డారు. దీంతో బామ్మర్ది ఎదపై బావ పిడిబాకుతో పొడవడంతో చికిత్స నిమిత్తం అతన్ని రిమ్స్‌కు తరలించగా, పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో కర్నూలుకు వైద్యులు రెఫర్ చేశారు. వన్‌టౌన్ ఇన్‌చార్జ్ సీఐ నాగార్జున విషయం తెలుసుకుని ఎస్‌ఐ హుసేన్‌తో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సీఐ వివరాల మేరకు.. గుర్రాలగడ్డకు చెందిన మహబూబ్‌బాషా తన సోదరిని కడప తిలక్‌నగర్‌కు చెందిన రియాజ్‌బాషాకు ఇచ్చి కొన్నేళ్ల క్రితం వివాహం చేశాడు. అయితే భార్య, భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడంతో శుక్రవారం గొడవ పడి ఆమె పుట్టింటికి వచ్చింది. కాగా శనివారం బావాబామ్మర్దులు కలిసి మద్యం సేవించి ఆటోలో గుర్రాలగడ్డకు వెళుతుండగా రెండో గాంధీబొమ్మ వద్దకు రాగానే బుల్లెట్ బండి తాళం విషయమై ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో రియాజ్ వద్ద ఉన్న పిడిబాకుతో మహబూబ్ బాషా ఎదపై గట్టిగా పొడవడంతో రక్తస్రావమైంది దీంతో ఒక్కసారిగా కేకలు వేయడంతో స్థానికులు హుటాహుటిన కడపలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో అక్కడి నుంచి వారు రిమ్స్‌కు తరలించగా రిమ్స్ వైద్యుల సూచనల మేరకు మహబూబ్‌బాషాను కర్నూలుకు రెఫర్ చేశారు. నిందితుడు అక్కడి నుంచి పరారీ అయ్యాడు. అయితే నిందితుడి కోసం సీఐ నాగార్జున ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా రియాజ్‌కు నేరచరిత్ర ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

జాతీయ హైవేపై రెండు కార్లు ఢీ

● ఇరువురికి గాయాలు




చెరువుకట్టపై దెబ్బతిన్న వాహనాలు, (ఇన్‌సెట్లో) గాయాలపాలైన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

ఓబులవారిపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కడప-చెన్నై జాతీయ రహదారి రెడ్డిపల్లె చెరువుకట్ట సమీపంలో 2 కార్లు ఢీకొని ఇరువురికి గాయాలయ్యాయి. హైవే మొత్తం గుంతలమయం కావడంతో గుంతలు తప్పించుకుని వెళ్లే క్రమంలో అదుపు తప్పి ఇరు వాహనాలు ఢీకొన్నాయి. కడప వైపు నుంచి ఏపీ39ఎంకె 7111 క్రెటా కారులో పుష్పమి అను సాఫ్ట్‌వేర్ యువతి కుటుంబం భర్త, పసిబిడ్డతో హైదరాబాదు నుంచి తిరుపతికి వెళుతున్నారు. తిరుమల శ్రీవారి దర్శనం నుంచి నంద్యాలకు ఏపీ 21ఎబి 6666 నంబరు గల ఇన్నోవా కారులో మరో కుటుంబం వెళుతున్నారు. వారి దారిలో వెళ్లాల్సిన వాహనం గుంతలు తప్పించేందుకు మరో దారిలో వెళ్లగా ఎదురుగా వస్తున్న వాహనం ఢీకొనడంతో ఇరువాహనాల ఇంజన్లు దెబ్బతిన్నాయి. ఎయిర్ బెలూన్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పి గాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ మహేష్ సిబ్బందితో వచ్చి క్షతగాత్రులను అంబులెన్సులో రాజంపేట ఆసుపత్రికి తరలించారు. అనంతరం రోడ్డుపై నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వినియోగం అనర్థం

● వ్యాధుల నివారణకు అధిక మోతాదుల్లో యాంటిబయాటిక్స్
● వ్యాధి నిర్ధారణ తర్వాతే వాడాలంటున్న నిపుణులు



పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల

ప్రొద్దుటూరు రూరల్, జనవరి4 (ఆంధ్రజ్యోతి): పశువులకు వచ్చే వ్యాధులకు తొందరగా నయం చేయాలన్న ఆతృతతో పోషకులు యాంటీబయాటిక్స్‌ను ఎక్కువగా వినియోగిస్తున్నారు. ఫలితంగా వ్యాధులు తగ్గకపోగా బ్యాక్టీరియా వైరస్ బలపడి యాంటీబయాటిక్స్‌కు కూడా లొంగని పరిస్థితి ఏర్పడుతోంది. పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు యాంటిబయాటిక్స్ సెన్సిటివ్ టెస్ట్ (ఏబీఎస్పీ) చేయించాకే మందులు వాడాలని నిపుణులు సూచిస్తున్నారు. లేనిపక్షంలో మున్ముందు రోగాలు మరింత ప్రమాదకరంగా మారుతాయని హెచ్చరిస్తున్నారు. వ్యాధులు న్న పశువుల పాలు, మాంసం ద్వారా మనిషులకు చేరే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తమవుతోంది.

● జిల్లావ్యాప్తంగా పశువుల్లో వచ్చే చిన్న చిన్న వ్యాధులకు సైతం అధిక మోతాదుల్లో యాంటిబయాటిక్స్ వాడకం విపరీతంగా పెరిగిపోయింది. సూక్ష్మమైన బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్‌లు మానవులు, పశువుల శరీరం లోపల, బయటా ఉంటాయి. వీటిని మైక్రోస్ అని పిలుస్తారు. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి, రోగ నిరోధక శక్తి సక్రమంగా ఉండేందుకు మేలు చేసే బ్యాక్టీరియా, వైరస్‌లు తోడ్పడతాయి. పశువుల శరీరానికి హానిచేసే బ్యాక్టీరియాల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టడానికి పోషకులు యాంటిబయాటిక్స్‌పై ఆధారపడుతున్నారు. నిర్దేశిత మోతాదు, నిర్ణీత కాలం కాకుండా ఇష్టానుసారం అనేక దుష్పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి.

● **సీజనల్ వ్యాధులు**

ప్రస్తుత శీతాకాలంలో పశువులు, జీవాల్లో గొంతువాపు, గాలికుంటు, లింపిస్కిన్ సహా పాడిపశువులకు పొదుగువాపు వ్యాధి, జీర్ణసంబంధ, గర్భకోశ వ్యాధులు ఎక్కువగా వస్తుంటాయి. వీటికి టీకాలు, యాంటీబయాటిక్స్ ద్వారా వైద్యం చేస్తారు. పశువుల వ్యాధులపట్ల పోషకులు మందులను ఇష్టానుసారం వాడకూడదని వైద్యుల సూచనలపై వాడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

● **పరీక్షల తర్వాత వాడితే మేలు**

పశువుల్లో వ్యాధి వస్తే నమూనాలు సేకరించి యాంటిబయాటిక్స్ సెన్సిటివ్ టెస్ట్ (ఏబీఎస్పీ) చేయించాలి. రోగ నిర్ధారణకు రక్తం, పాలు, చీము, చీమిడి, ముక్కునుంచి కారే రసాలను నమూనాలుగా సేకరించి ఈ పరీక్షను నిర్వహిస్తారు. ఇందులో 14 రకాల యాంటిబయాటిక్స్‌ల్లో ఏ మందులు వాడాలో పరీక్ష ఫలితం సూచిస్తుంది. ఫలితాల ఆధారంగా మందులు వాడాలి. దీంతో పోషకులకు ఖర్చు తగ్గుతుంది. పశువులు త్వరగా కోలుకుంటాయి. పరీక్షల ద్వారా నిర్ధారణ చేయకుండా ఒకటి పనిచేయకపోతే మరొకటి అన్నట్లుగా వాడితే ఇబ్బందులు, ఎదురవుతాయని వైద్యులు సూచిస్తున్నారు. మరోవైపు వైద్యుల సూచనల మేరకు నిర్ణీత కాలం సగటున 3 నుంచి 5 రోజులు మందులు వాడకంతో ఇబ్బందులు ఎదురవుతాయి. ఈ నేపథ్యంలో ఏబీఎస్పీ తప్పనిసరని వైద్యులు సూచిస్తున్నారు.



(ఏబీఎస్పీ) పరీక్ష కిట్టు

● **పరీక్షలు ఉచితమే**

పశువైద్యులు నమూనాలను సేకరించి నియోజకవర్గ కేంద్రాల్లో ఉన్న పశుసంవర్ధక ప్రయోగశాలలకు పంపితే పరీక్షలు చేసి పశువులకు ఏ జబ్బులు వచ్చాయో నిర్ధారిస్తారు. ఏ యాంటి బయాటిక్ పనిచేస్తుందో 24 గంటల నుంచి 48 గంటల వ్యవధిలో నివేదిక ఇస్తారు. ఈ ప్రక్రియ మొత్తం ఉచితమే.

● **పశువుల నుంచి మనుషులకు వ్యాప్తి**



మితిమీరి యాంటిబయాటిక్స్ వాడకంతో అటు పశువులకేకాక వాటి ద్వారా మనుషులకు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఎక్కువ మోతాదులో యాంటిబయాటిక్స్ వాడకంతో గొర్రెలు, మేకలు వ్యాధి నిరోధకశక్తిని కోల్పోతాయి. వాటి మాంసం తినేందుకు పనికిరాదు. ఆ పాలను తాగిన దూడల్లో కూడా రోగ నిరోధక శక్తిపై ప్రభావం చూపుతుంది. పాలను తాగితే చిన్నపిల్లలు, పెద్దల్లో డయేరియా, వాంతులు, విరేచనాలు, జీర్ణసంబంధిత వ్యాధులు, హార్మోన్లపై ప్రభావం తదితర దుష్ఫలితాలు ఉంటాయి.

డాక్టర్ ధనుంజయరెడ్డి, సహాయ సంచాలకుడు

నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోండి

- మైనార్టీ కార్పొరేషన్ ఈడీ బ్రహ్మయ్య

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కడప జిల్లాలోని మైనార్టీ నిరుద్యోగ యువత నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య కోరారు. సీడాప్ ద్వారా మైనార్టీ యువతకు నైపుణ్యాభివృద్ధి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సీలు, జైనులు తమ వివరాలను ఎస్ఈఈడీఏపీ.ఏపీ..ఈఓవీ.ఇన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రాన్స్‌పోర్ట్, కెరీర్ కౌన్సెలింగ్‌లో ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. దరఖాస్తు, నకలు జతచేసి మూడు కాపీలను కార్యనిర్వాహక సంచాలకులు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, 'డి' బ్లాక్ న్యూ కలెక్టరేట్, కడప-516004 చిరునామాకు సమర్పించాలని తెలిపారు. ఇతర వివరాలకు 08562-2411375ను సంప్రదించాలని సూచించారు.

శస్త్రచికిత్సలో వైద్యురాలి నిర్లక్ష్యం

కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌తో పేగుకు ఇన్‌ఫెక్షన్
హైదరాబాదులో చికిత్సకు రూ.10లక్షలు వ్యయం
వైద్యురాలిపై విచారణ చేపట్టిన అధికారులు



విచారణ అధికారులతో మాట్లాడుతున్న బాధితురాలు

ప్రొద్దుటూరు , జనవరి 4 (ఆంధ్రజ్యోతి): వైద్యురాలి నిర్లక్ష్యంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకున్న మహిళ పేగు ఇన్‌ఫెక్షన్‌కు గురైంది. బాధితురాలు హైదరాబాద్‌లో రూ. 10 లక్షలు ఖర్చు చేసిన సంఘటన వెలుగు చూసింది. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణీపై బాధితురాలు కలెక్టరుకు ఇచ్చిన ఫిర్యాదుపై కడప రిమ్స్ నుంచి వైద్య అధికారులు వచ్చి బాధితురాలు, పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ ఇలియారాణిని శనివారం విచారించారు. వివరాల్లోకెళితే...

చాపాడు మండలం నక్కల దిన్నె వాసి శివలక్ష్మీ 2024 అక్టోబరు 29న ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకుంది. అదే రోజు డిశ్చార్జి చేసి పంపారు. ఇంటికి వెళ్లాక వరుసగా వాంతులవుతున్నాయని ఆపరేషన్ చేసిన డాక్టర్ ఇలియారాణికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చారు. ఆ మరుసటి రోజు మళ్లీ ఆస్పత్రికి రాగా ఎక్స్‌రే తీసి గ్యాస్ ట్రబుల్ సమస్య వుందని మందులిచ్చి పంపారు. కానీ కడుపు నొప్పి పెరుగుతోందని నవంబరు 2న మళ్ళీ డాక్టర్‌ను సంప్రదిస్తే స్కానింగ్ చేసి సమస్య ఏమీ లేదని తెలిపారు. డాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని గుర్తించి ప్రైవేటుగా స్కానింగ్ చేయించుకోగా ఆపరేషన్‌తో పేగు దెబ్బతిన్నట్లు తెలిసింది. దీంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాదుకు వెళ్లి మరో సర్జరీ చేయించుకున్నారు. దాదాపు వారికి రూ.10 లక్షలు ఖర్చు అయినట్లు తెలిపారు. రెండో విడత సర్జరీ కూడా చేయాల్సివుందని హైదరాబాద్ వైద్యులు తెలిపినట్లు వెల్లడించారు. పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలని కలెక్టరుకు బాధితురాలు శివలక్ష్మీ, ఆమె భర్త విశ్వనాథరెడ్డి ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో రిమ్స్ కళాశాలకు చెందిన డాక్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో ఒక రేడియాలజిస్టు, సర్జన్, గైనకాలజిస్టు విచారణ బృందం బాధితురాలు శివ లక్ష్మీని విచారించారు. డాక్టర్ ఇలియా రాణిని కూడా ప్రత్యేకంగా ఆమె చాంబర్‌లో విచారించారు. ఇదిలావుండగా పీపీ యూనిట్ విచారణకు వచ్చిన బాధితురాలు శివలక్ష్మీ తన భర్త విశ్వనాథ్‌రెడ్డితో కలిసి డాక్టర్ ఇలియారాణి చాంబర్‌కు వెళ్లి తమకు జరిగిన అన్యాయంపై నిలదీశారు. వాగ్వాదం చేసుకోవడంతో డాక్టర్ ఇలియా రాణి అక్కడి నుంచి వెళ్లి పోయింది.

ప్రాజెక్టులను విస్మరిస్తే పోరు తప్పదు

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్



సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ర్యాలీ

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సీమ సాగునీటి ప్రాజెక్టులను కూటమి ప్రభుత్వం విస్మరిస్తే పోరుబాట తప్పదని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ హెచ్చరించారు. శనివారం సీపీఎం జిల్లా 12వ మహాసభల సందర్భంగా జియోన్ కళాశాల నుంచి ఐటీఐ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజించు పాలించు పద్ధతిలో ప్రజల మధ్య మత వైషమ్యాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతోందన్నారు. రాష్ట్రంలోని ప్రకృతి వనరులన్నీ అదానీకి తాకట్టు పెట్టడానికి ప్రయత్నిస్తోందన్నారు. పోర్టులు అదానీ పరమయ్యాయి, వేలాది ఎకరాలు అదానీకి కట్టబెడుతున్నారన్నారు. కడప జిల్లాలో ఉక్కు ఫ్యాక్టరీ శిలాఫలకాలకే పరిమితమైందన్నారు. విభజన చట్టం హామీలు దశాబ్దాల తరబడి వెనుకబడిన ప్రాంతాల్లో ఏ ఒక్కటి అమలు కాలేదన్నారు. ఏపీలోని కూటమి సర్కార్ మౌనంగా ఉండడం సరైంది కాదన్నారు. కార్పొరేట్ల కోసమే జమిలీ ఎన్నికలను తెచ్చేందుకు మోదీ చూస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లను పగలగొట్టండని యువగళం పాదయాత్రలో నారా లోకేష్ పిలుపునిచ్చారని, అయితే టీడీపీ అధికారంలోకి వచ్చాక స్మార్ట్ మీటర్లను ఎందుకు బిగిస్తున్నారని ప్రశ్నించారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు ఊసే లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురవుతోందని, జిల్లాలో రైతాంగం ఆత్మహత్యల పరంపరం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

బహిరంగ సభలో సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రామ్మోహన్, బి.మనోహర్, శివకుమార్, ఐఎం సుబ్బమ్మ, జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, అన్వేష్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాసులు, శివకుమార్, తదితర సంఘాల నేతలు, ప్రజలు పాల్గొన్నారు.

నీటిలో మునిగి వ్యక్తి మృతి



ముస్తఫా మృతదేహం

పులివెందుల టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ సమీప వంకలో దిగి వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాల్లోకెళితే.... కదిరి నియోజకవర్గం పట్నం వాసి ముస్తఫా రెండేళ్ల నుంచి సుబ్రమణ్యం వద్ద పశువులు మేపుతూ ఉండేవాడు. రోజు మాదిరిగానే పశువులు మేపేందుకు ముస్తఫా పశువులను తీసుకుని రోటరీపురం సమీపంలోకి వెళ్లాడు. అక్కడ పశువులు వంకలోకి దిగాయని ముస్తఫా కూడా దిగడంతో ఆయనకు ఈత రాక మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విష్ణు ఆధ్వర్యంలో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలను ఆ ప్రాంతంలోని వారిని అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వన్‌స్టాప్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోండి

కడప రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న మహిళలు వన్‌స్టాప్‌సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. రిమ్స్ ఆవరణలోని వన్‌స్టాప్ సెంటర్‌ను శనివారం జడ్జి విజిట్ చేశారు. రిజిస్టర్లను పరిశీలించారు. వసతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వన్‌స్టాప్ సెంటర్‌లో ఒకేచోట అనేక సేవలను అందిస్తామన్నారు. చట్టపరమైన సలహాలు, మానసిక సలహాలు, పోలీసుల సహాయం, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం పొందవచ్చన్నారు. ఉచిత న్యాయసహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్టు, హెల్ప్‌లైన్ నెంబరు 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబరు 14456పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వన్‌స్టాప్ సెంటరు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ సెలక్షన్ నేషనల్ కమిటీ సభ్యుడిగా జనార్ధన్



కడప స్పోర్ట్స్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కర్నూలులో జరగనున్న 50వ ఆంధ్ర రాష్ట్ర కబడ్డీ జూనియర్స్ బాల, బాలికల నేషనల్ సెలక్షన్ కమిటీ సభ్యుడిగా జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి జనార్ధన్ ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ వద్మజాబాల నియమించినట్లు వెల్లడించారు. జనార్ధన్ నియామకం పట్ల జిల్లా అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

నేడు శిల్పారామానికి టీవీ యాంకర్ల రాక

కడప కల్చరల్ జనవరి 4, (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీప శిల్పారామం సాంస్కృతిక కళావేదికపై ప్రత్యేకంగా ఆకర్షణగా టీవీయాంకర్లు శ్రీయుక్తా, అమూల్య రానున్నట్లు పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి వెల్లడించారు. శిల్పారామంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం జరగనున్న కార్యక్రమాలకు కడప నృత్య కళాకారిణి విజయశాంతి బృందం కళాకారులు శాస్త్రీయ, జానపద, కూచిపూడి, సినీ గీతాలకు అభినయించనున్నారన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ జరగనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమాలను దిగ్విజయం చేసేందుకు ప్రజలు హాజరవాలని కోరారు.

అధికారుల సమక్షంలో పోస్ట్‌మార్టం

మైదుకూరు రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): అధికారుల సమక్షంలో శెట్టివారి పల్లె వాసి అల్లాడుపల్లె వీరారెడ్డి (75) మృతదేహాన్ని గుంత నుంచి వెలికి పోస్ట్‌మార్టం చేశారు. డిసెంబరు 6న తండ్రి మృతి చెందడంపై వీరారెడ్డి కుమారుడు రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దినేష్, తహసీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎస్ఐ చిరంజీవి తదితర అధికారుల పాల్గొన్నారు.

కొండాపురంలో స్టాపింగ్ పొడిగింపు

కొండాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం-ధర్మవరం రైళ్లను కొండాపురం రైల్వేస్టేషన్‌లో ఆరునెలల పాటు స్టాపింగ్ పొడిగించారు. ఆదివారం నుంచి ఆరు నెలలు స్టాపింగ్‌ను పొడిగిస్తారని, ప్రతి ఆరునెలలకు ఒకసారి రైల్వేశాఖ రివ్యూ చేస్తూ కొండాపురంలో స్టాపింగ్‌ను పొడిగిస్తూ వస్తోంది. కాగా ఈ రైలు విజయవాడ, గుంటూరు వెళ్లేందుకు సీమ ప్రజలకు ఎంతో ఉపయుక్తం.

డీఏ అరియర్స్ మంజూరు చేయండి

కడప మారుతీనగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డీఏతోపాటు అరియర్స్, అలాగే అడిషినల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ మంజూరు చేయాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఎస్. మునయ్య అభ్యర్థించారు. శనివారం స్థానిక నాగరాజుపేట ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో మంది ప్రభుత్వ పెన్షనర్లు నేటికీ బాడుగ ఇళ్లలోనే కాలం వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

హైందవ శంఖారావానికి బయలుదేరిన జిల్లా వాసులు

కడప కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈనెల 5న జరుగనున్న హైందవ శంఖారావం భారీ బహిరంగ సభకు కడప నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివెళ్లారు. శనివారం సాయంత్రం 6 గంటలకు కడప రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలు విజయవాడకు బయలుదేరింది. ఇందులో సుమారు 2 వేల మందికి పైగా జిల్లా వాసులు బయలుదేరారు.

సింహాద్రిపురంలో...

హైందవ శంఖారావం బహిరంగ సభకు సింహాద్రిపురం మండలం నుంచి భారీ సంఖ్యలో జనం తరలివెళ్లారు. తొలుత సింహాద్రిపురం చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి, భానుకోట శైవక్షేత్ర శివయ్య స్వామి తదితరులు జెండా ఊపి బస్సును ప్రారంభించారు.

జల్‌జీవన్ పథకం మూన్నాళ్ల ముచ్చటేనా?

● రెండేళ్లు దాటినా పాతికభాగం పూర్తి కాని దుస్థితి ● నాడు ఆర్భాటంగా ప్రారంభించి నేడు పట్టించుకోని వైనం



వైసీపీ పాలనలో శంకుస్థాపన చేసిన జల్‌జీవన్ మిషన్ శిలాఫలకం

చెన్నూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : 'ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం, ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేచేస్తాం' అంటూ ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన పాలకులు ఆ పథకాన్ని పక్కనబెట్టారు. 2021 జూన్ 14న చెన్నూరులో ఇంటింటికీ కుళాయిలు అందిస్తామని రూ.58.95లక్షలతో జల్‌జీవన్ పథకాన్ని నాటి ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అయితే ఆ పథకం మూన్నాళ్ల ముచ్చట అయింది. పూర్తిస్థాయిలో కుళాయిలు అందించాలన్న లక్ష్యానికి నాటి పాలకులే తూట్లు పొడిచారు. ముఖ్యంగా కొత్తరోడ్డు ప్రాంతంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలు ఉన్నారు. వీరంతా దినసరి కూలీలు. సొంతింటికి కుళాయి వేసుకోవాలన్నా రెండు నెలల పాటు కూలి పనులు చేసి డబ్బు మిగలబెట్టుకుని పంచాయతీకి కట్టి కనెక్షన్ తీసుకోవాలి. అయితే పేదల్లో చాలా మంది వీధికుళాయిల పైనే ఆధారపడి ఉన్నారు. నేటికీ ఈ ప్రాంతాల్లో చాల వరకు వీధికుళాయిలే దిక్కు. అయితే ఈ వీధి కుళాయిల వల్ల నిరంతరం నీరు రావడంతో వీధులన్నీ పలు చోట్ల మురికిమయంగా మారి దోమలకు నిలయంగా మారుతూ రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో అప్పటి ప్రభుత్వం ఇంటింటికీ కుళాయి పథకం అందిస్తే వీధి కుళాయిలు లేకుండా పోయి నీటిని పొదుపుగా వాడి పరిశుభ్రమైన నీటిని తాగుతారని ఆలోచన చేసింది. అయితే ఆ ఆలోచన పూర్తిస్థాయిలో అమలుకాక ముందే వారే అటకెక్కించారు. సుమారు 1500 కు పైగా కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని అప్పట్లో నిర్ణయించుకుని కేవలం 350 కుళాయిలతోనే సరిపెట్టారు. అంతేకాక అప్పుడు పనులు చేసిన కాంట్రాక్టర్లు సైతం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో అతను చేతులెత్తేశాడు. స్వచ్ఛమైన నీరు అందించాల్సిన పథకం కాస్త నీరుగారిపోయింది. ప్రజలు కూడా ఇంటింటికీ కుళాయి పథకం అంటే ఇదేనా, భలే ఇచ్చారే ఇంటింటికీ కుళాయి అని వ్యంగ్యంగా మాట్లాడుకుంటున్నారు. ఈ జల్‌జీవన్ మిషన్ పథకం పూర్తిస్థాయిలో అమలు కాక నేటికీ వీధి కుళాయిలే దర్శనమిస్తున్నాయి.

పథకం పూర్తి కాని మాట వాస్తవమే



జలజీవన్ మిషన్ పథకం చెన్నూరులో పూర్తికాని మాట వాస్తవమే. 1500కు పైగా కుళాయిలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుని కొంత వరకు పనులు జరిగాయి. సకాలంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు రాకపోవడంతో అప్పటి కాంట్రాక్టరు కూడా పనులు ఆపివేశాడు. కాంట్రాక్టరుకు ఆలస్యంగా కొంత వరకు బిల్లు వచ్చింది. అయితే పనులు మాత్రం ముందుకు సాగలేదు. కుళాయి ఇవ్వాలనే ఆలోచనలో ప్రస్తుత ప్రభుత్వం ఉంది. ఉన్నతాధికారులు కూడా ఈ పథకంపై చర్చించారు.

- రామసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, చెన్నూరు

అంచనాలు వేసి పంపాం



ఇంటింటికీ కుళాయి ఇవ్వాలన్న విషయంపై ఉన్నతాధికారులకు తెలిపాం. మండల వ్యాప్తంగా కాకుండా నియోజకవర్గ వ్యాప్తంగా అధికారులకు తెలియజేశాం. ఆ మేరకు పథకం కూడా త్వరలో మంజూరవుతుంది. అయితే ఇది కేంద్ర ప్రభుత్వం పథకం. గతంలో జరిగిన పనులు రద్దయ్యాయి. 20శాతం పనులు చేసినా వాటిని రద్దు చేశారు. పాత టెండర్లు రద్దయ్యాయి. కొత్తగా కేంద్ర ప్రభుత్వం అనుమతిస్తే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పనులు చేపడతాం.- **ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యుఎస్, చెన్నూరు**

వ్యాసరచన పోటీ విజేతలు వీరే..

కడప కల్చరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని విశ్వాత్మ పిరమిడ్ యోగా, మెడిటేషన్ రీసెర్చ్ సెంటర్, కడప పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని విశ్వాత్మ యోగా సెంటర్‌లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ పోటీలలో ప్రథమ సంయుక్త విజేతలుగా కె. శ్రీ సుశ్మిత (కడప) ఎస్. సాయిలిఖిత (కడప), ద్వితీయ విజేతగా ఇ.గౌతమి (ప్రొద్దుటూరు), తృతీయ విజేతగా ఎస్.విష్ణుప్రియ (జమ్మలమడుగు) కన్సొలేషన్ బహుమతి విజేతగా జి.అభిరామ్‌రెడ్డి (కడప) నిలిచినట్లు విశ్వాత్మ పిరమిడ్ యోగా మెడిటేషన్స్ రీసెర్చ్ సెంటర్ ప్రతినిధి జి.వి. శేషారెడ్డి తెలిపారు.

గోవింద స్వాముల తిరుమల పాదయాత్ర

కడప ఎన్టీఆర్ సర్కిల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తిరుమలేశుని తొలిగడప దేవుని కడప నుంచి గోవిందమాల భక్తులు శనివారం తిరుమల పాదయాత్ర మొదలుపెట్టారు. దీక్షలు పూర్తిచేసుకొని ముడుపులతో మొదటగా దేవుని కడపలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి దర్శనం తర్వాత పాదయాత్రను మొదలుపెట్టారు. మున్సిపల్ హైస్కూల్ వద్ద అన్నమాచార్య విగ్రహానికి పూజలు నిర్వహించారు. కడపలో నగర సంకీర్తన చేశారు. దారిపొడవునా శ్రీవారి భక్తులు ఘనంగా స్వాగతం పలికారు.

'145 జీవోను రద్దుపరచాలి'



మాట్లాడుతున్న నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు రవి, మధుసూదన్

కడప రూరల్, జనవరి 4(ఆంధ్రజ్యోతి) : కక్షిదారులను ఇబ్బందులకు గురిచేసే 145 జీవోను ప్రభుత్వం వెంటనే రద్దుపరచాలని నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు రవి, మధుసూదన్, జిల్లా అధ్యక్షుడు గురుస్వామి డిమాండ్ చేశారు. 145 జీవో ద్వారా ఈగిల్(ఫాస్ట్ ట్రాక్ కోర్టు)ను తిరుపతిలో ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ కడప న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టు ఎదుట చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 29వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు నాయీబ్రాహ్మణ సంక్షేమ సంఘం సంపూర్ణ మద్దతు తెలియజేసి దీక్షలలో పాల్గొంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలు కక్షిదారులకు ప్రయోజనం చేసేలా ఉండాలే కాని నష్టదాయకంగా ఉండకూడదన్నారు. శనివారం దీక్షలను ఎ.రవిచక్రవర్తి, యు. రామస్వామి, పి.అన్వర్‌బాషా, జె.సురేష్, టి. జయచంద్రబాబు చేపట్టారు. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.గుర్రప్పనాయుడు, మాజీ ఉపాధ్యక్షుడు రాజగోపాల్‌రెడ్డి, షైనుద్దీన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పట్ల ప్రేమతో మెలగాలి

వల్లూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల పట్ల ప్రేమతో మెలగాలని వల్లూరు మండల విద్యాశాఖాధికారులు బేబి, విజయారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన వల్లూరులో ఎంపీపీఎస్ మెయిన్ పాఠశాలలో ఉన్న భవిత సెంటరులో దివ్యాంగుల దినోత్సవం, బ్రెయిలీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వీల్‌చైర్లను అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, ఐఈఆర్‌టి లక్ష్మి ప్రసన్న, అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోయాక సర్వీసు రోడ్డు వేస్తారా?

● ఒక్క పైసా టోల్‌ప్లాజా చెల్లించం
● ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు చేస్తే మీదే బాధ్యత
● టోల్‌ప్లాజా సిబ్బందిపై ఎంపీపీ ఆగ్రహం



టోల్‌ప్లాజా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎంపీపీ సురేశ్‌యాదవ్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

చెన్నూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : 'ఏళ్ల కొద్దీ టోల్‌ప్లాజా వసూలు చేసుకుంటున్నారు.. రూ. కోట్లు సంపాదించారు.. అభివృద్ధి పనులు దగ్గరకొచ్చేసరికి మాత్రం పక్కనబెట్టారు. ప్రజలు ప్రమాదాలపాలై ప్రాణాలు కోల్పోయాక సర్వీసు రోడ్లు వేస్తారా.. ఏం తమాషాగా ఉందా.. ఒక్కపైసా టోల్‌ప్లాజా కట్టం, ప్రజలు మీపై తిరగబడి ధర్నాలు, రాస్తారోకోలో చేసినా మీదే బాధ్యత' అంటూ ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు నిరంజన్‌రెడ్డి, చెన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు గోదిన శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యులు వారిష్, సర్పంచ్‌లు టోల్‌ప్లాజా సిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కొత్తరోడ్డుపై ఎన్నో ప్రమాదాలు జరిగాయని, ఎంతో మంది వికలాంగులయ్యారని, దీని కారణం సర్వీసురోడ్లు వేయకపోవడమేనని సభ్యులు తెలిపారు. తొమ్మిదేళ్లయింది నెలనెలా కోట్ల రూపాయలు వసూలు చేసుకున్నారు. ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి సైతం మిమ్మల్ని హెచ్చరించినా మీ తీరు మాత్రం మారడంలేద అని ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూరు నీటి సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ కారులో కాకుండా కొత్త రోడ్డు పై నుంచి బస్సులో వెళితే ప్రజల ఇబ్బందులు తెలుస్తాయి అని హెచ్చరించారు. ఎంపీపీ మాట్లాడుతూ హైవేపై ప్రాజెక్టు డైరెక్టరు ఢిల్లీ నుంచి ఏమన్నా రావాల్నా.. పనులు చేయాలంటే ఆయననే సమావేశానికి రమ్మనండి, ఇక మీరెవరూ రావద్దని హెచ్చరించారు. అలాగే రామాలయం వద్ద గృహ సముదాయాలు పెరిగినా త్రీఫేజ్ కరెంటు లేదని, బయనపల్లె, బుడ్డాయపల్లెల్లో అంగన్వాడీ కేంద్రాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. రామనపల్లెలో సబ్‌స్టేషన్ పరిస్థితి ఏంటి, సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఎక్స్‌రే పనిచేయక ఎంతో కాలమైనా పట్టించుకోలేదన్నారు. టోల్‌ప్లాజా సిబ్బంది మాట్లాడుతూ హైవే సమస్యలు ఎన్‌హెచ్‌ఏ పీడీకి చెప్పామన్నారు. అలాగే ఉప్పరపల్లె ఎంపీటీసీ మాట్లాడుతూ పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నిషియన్ పనితీరు సరిగా లేదని, రోగులకు సరిగా సమాధానం చెప్పడం లేదన్నారు. నరసారెడ్డిపల్లె వద్ద కేసీ మెయిన్ కెనాల్ లైనింగ్ దెబ్బతిని పెద్ద గుంతలు పడి రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సాగరకుమారి మాట్లాడుతూ హాస్పిటల్ భవనం పూర్తి కాలేదన్నారు. ల్యాబ్ టెక్నిషియన్ పనితీరుపై ఉన్నతాధికారులకు నివేదిక పంపామన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ చెన్నారెడ్డి మాట్లాడుతూ పించన్ల అవకతవకలపై వచ్చే వారంలో పూర్తిస్థాయిలో ఉన్నధికారుల ఆదేశాల మేరకు వెరిఫికేషన్ ఉంటుందని తెలిపారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఉమామహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో కొత్తగా టెండర్లు పిలుస్తామన్నారు. ఈవోఆర్‌డీ సురేశ్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో మెడికల్ క్యాంపులు, దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్ మోహన్‌రావు, పంచాయతీరాజ్ ఏఈ మల్లిఖార్జున. డీటీ వెంకటరమణ, ఎంఈవోలు గంగిరెడ్డి, సునీత, ఎంపీటీసీ నాగిరెడ్డి, సర్పంచ్‌లు నారాయణరెడ్డి, వెంకటసుబ్బయ్య, సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, శివకుమార్, సుబ్రమణ్యంలతో పాటు ఏపీవో, ఏపీఎం, ఐసీడీఎస్, ఏఓ శ్రీదేవి, పశువైద్యాధికారి ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో అన్నీ కష్టాలే

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో ప్రజలకు నష్టాలు, కష్టాలు తప్ప మేలు చేసేది శూన్యమని వైసీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఆరోగ్యశ్రీ పథకం ప్రైవేటుపరం చేసే ఆలోచనలో ఉన్నారని విమర్శించారు. శనివారం కడప నగరం వైసీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం పింఛన్లు పెంచడం తప్ప ఒక్క పథకం కూడా ప్రవేశపెట్టిన దాఖలాలు లేవన్నారు. వైసీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, షఫీ, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం

● టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం ఏర్పడి కేవలం 7 నెలల మాత్రమే గడిచింది. అంతలోనే ప్రతిపక్ష వైసీపీ నేతలు బురదజల్లే ప్రయత్నాలు చేయడం సిగ్గుచేటని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. రాష్ట్రంలో జమిలి ఎన్నికలు వస్తే తాము గెలుస్తామనే భ్రమలో వైసీపీ ఉందన్నారు. శనివారం తన కార్యాలయంలో శ్రీనివాసరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. కూటమి ప్రభుత్వానికి వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే అవాకులు చవాకులు పేలుతున్నారని ధ్వజమెత్తారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి

సికెదిన్నె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎంపీసీఎల్ సర్వేను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో కులాయి బాబు తెలిపారు. పాపాసాహెబ్ పేట సచివాలయాన్ని శనివారం పరిశీలించారు.

మనువాద రాజ్యాంగం ప్రమాదకరం

కడప కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): మనువాద రాజ్యాంగం ప్రమాదకరమని వక్తలు ఎస్.ఎ సత్తార్, నారాయణరెడ్డి, సి.ఆర్.వి ప్రసాద్, అలీఖాన్, అప్జల్‌ఖాన్, గుర్రప్ప, బండి జకరయ్య పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో 'రాజ్యాంగం, అంబేడ్కర్‌పై మనువాదుల దాడులు' అనే విషయంపై చర్చా వేదిక జరిగింది. ఈ సందర్భంగా ఐక్యవేదిక నేతలు మాట్లాడుతూ లౌకిక భారత రాజ్యాంగాన్ని మార్చి మనువాద రాజ్యాంగాన్ని అమలు చేసేందుకు మనువాద నాయకులు యత్నిస్తున్నారన్నారు.

పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

కమలాపురం రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్ ఫిజికల్ వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శనివారం వ్యవసాయశాఖ సిబ్బందికి సమీక్ష సమావేశం నిర్వహించారు. నరసింహారెడ్డి పాల్గొని మాట్లాడారు.

సీపీడబ్ల్యూఎస్ వాటర్ స్కీంను పరిశీలించిన జడ్పీ సీఈఓ

చక్రాయపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): కె.ఎర్రగుడిలో నిర్మించిన మంచినీటి పథకం (సీపీడబ్ల్యూఎస్)ని జడ్పీ సీఈఓ ఓబులమ్మ శనివారం పరిశీలించారు.ప్రజల దాహార్తి తీర్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని, నీటి కొరత రాకుండా చూడాలని తెలిపారు. ఇటీవల ఆంధ్రజ్యోతి దినపత్రికలో లక్ష్యం చేరని మంచినీటి పథకం శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన జడ్పీ సీఈఓ శనివారం పరిశీలించారు. కల్లూరుపల్లె, బీఎన్‌తండా, గరుగుతండా, గడ్డంవారిపల్లె, మాలపల్లె, సురభి గ్రామాల్లో వేసవిలో తీవ్రంగా నీటి ఎద్దడి ఉంటుంది. నివారించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డిని, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ కిరణ్ సల్మాన్, ఏఈ శంకర్‌మూర్తిని ఆదేశించారు. ఎక్కడైనా లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు.

వైవీయూకు ఐఎస్ఓ సర్టిఫికెట్లు

కడప ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన విశ్వవిద్యాలయానికి ఇంటర్నేషనల్ స్టాండర్డ్ ఆర్గనైజేషన్ (ఐఎస్ఓ)ధ్రువీకరణ పత్రాలు లభించాయి. విశ్వవిద్యాలయంలో నాణ్యమైన విద్య అందిస్తున్నందుకు ఈ పత్రాలను అందించారు. ఈ మేరకు ఆ సంస్థ సీఈఓ అలపాటి శివయ్య శనివారం విలేకరుల సమావేశంలో ఈ విషయం తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో సురక్షిత ప్రసవాలు

కడప కలెక్టరేట్, జనవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో సురక్ష ప్రసవాలను చేసుకోవాలని అక్కాయపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసరు డాక్టర్ ఉబేదుల్లా, డాక్టర్ వినయ్ తెలిపారు. శనివారం నాగరాజుపేటకు చెందిన షేక్ తబస్సుమ్ అనే మహిళ పురిటి నొప్పులతో బాధపడుతూ ఉదయం 9గంటల సమయంలో అక్కాయపల్లి పీహెచ్‌సీలో అడ్మిట్ అయింది. వైద్య సిబ్బంది ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. ఆమె ఆడ బిడ్డకు జన్మనిచ్చిందన్నారు.

పులివెందుల మార్కెట్ యార్డులో ఈ-నామ్ అమలుకు అంగీకారం

పులివెందుల టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పులివెందుల మార్కెట్ యార్డులో చీనీకాయలు క్రయ విక్రయాల్లో ఈ-నామ్ (సూట్ లేకుండా) అమలుకు అంగీకారం తెలిపారు. కలెక్టరు శ్రీధర్, వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు విజయసునీత ఆదేశాల మేరకు పులివెందులలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో శనివారం ప్రాంతీయ సంయుక్త మార్కెటింగ్ సంచాలకులు సి.రామాంజనేయులు అధ్యక్షతన ఈ-నామ్ అమలుపై చీనీకాయల వ్యాపారులతో సమావేశం జరిగింది.

మహనీయురాలు డొక్కా సీతమ్మ : ఎమ్మెల్యే



పెండ్లిమర్రి: విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న కమలాపురం ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి



వేంపల్లెలో మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కడప ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

పెండ్లిమర్రి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆకలితో ఉన్నవారికి లేదనకుండా అన్నం పెట్టిన మహనీయురాలు డొక్కా సీతమ్మ అని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు విద్యార్థినులు, అధ్యాపకులు ఘన స్వాగతం పలికారు. ముందస్తు సంక్రాంతి వేడుకలను పురస్కరించుకొని విద్యార్థినులు కళాశాల ప్రాంగణంలో వేసిన రంగురంగుల ముగ్గులు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి కళాశాల ప్రాంగణంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

విద్యావ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం:ఎమ్మెల్సీ

వేంపల్లె, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల పేదలు ఉన్నత విద్య చదివేలా కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకువస్తోందని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి అన్నారు. వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించారు. కళాశాలల ఆర్జేడీ రవినాయక్, స్పెషలాఫీసర్ అర్జున్‌రావ్, ఎంపీడీఓ కుళాయమ్మ కలిసి విద్యార్థులతో డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.

మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ

పులివెందుల రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైఎస్‌వీఆర్‌ఎం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు పౌష్టికాహారం ఇవ్వాలన్న ఏకైక లక్ష్యంతో పాఠశాలకే పరిమితమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా 475 కళాశాలల్లో అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ఐసీడీఎస్ పీడీ, పులివెందుల మండల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి మాట్లాడుతూ రక్తహీనతను తగ్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తోందన్నారు.

చక్రాయపేటలో...

చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం అధికారులు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రంతుబాషా, తహసీల్దార్ విజయకుమారి, ఎంపీడీఓ రాజశేఖర్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి ఆజాద్‌వలి, ఎంఈఓ రవికుమార్ తదితరుల చేతులమీదుగా విద్యార్థులకు భోజనం వడ్డించారు.

ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం లక్ష్యం

● ఎమ్మెల్యే మాధవి

కడప ఎడ్యుకేషన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థికి పౌష్టికాహారం ఇవ్వాలన్నదే కూటమి ప్రభుత్వం లక్ష్యమని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. శనివారం కడప నగరం ప్రభుత్వ బాలుర కళాశాలలో మధ్యాహ్న భోజనం పథకాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అట్టహాసంగా 'మధ్యాహ్న భోజనం' ప్రారంభం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు ఎమ్మెల్యే మధ్యాహ్న భోజనం వడ్డించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమణారెడ్డి, అధ్యాపకులు, ఎంఈవోలు సావిత్రమ్మ, శోభారాణి, వాల్మీకి, బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, కౌన్సిలర్ కమాల్‌బాష, టీడీపీ నాయకులు ఈవీ.సుధాకర్‌రెడ్డి, అమీర్‌బాష, ఫరీద్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు, జమ్మలమడుగులో మధ్యాహ్నభోజనాన్ని వడ్డిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు..: రాష్ట్ర ప్రభుత్వం జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనపథకాన్ని ఏర్పాటుచేసిందని, కమిషనర్ వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. శనివారం జమ్మలమడుగు నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ బాలికలు, బాలుర జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమంలో భాగంగా వారు ప్రారంభించారు. అలాగే జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి ప్రారంభించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొన్నతోట శ్రీను, మాధవరెడ్డి, ఐఎల్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: రాష్ట్ర ప్రభు త్వం నూతనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పతకాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగుంట్ల జూనియర్ కళాశాలలో ఆయన విద్యార్థులకు భోజనం వడ్డించి ప్రారంభించారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనపథకం నామకరణం చేసి ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ త్రివిక్రమ్‌రెడ్డి, కమిషనర్ పేర్లిశేషఫణి, ఎంపీడీవో వెంకటరమణయ్య, కూటమి మండల శాఖ అధ్యక్షుడు మధుసూధన్ రెడ్డి,నాయకులు,అధ్యాపకులు పాల్గొన్నారు.

కొండాపురం..: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన కార్యక్రమాన్ని ఎంపీడీవో నాగప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రంలో ఎంఈవోలు ఓబులేసు, రామయ్య, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైలవరం..: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని శనివారం తహసీల్దారు లక్ష్మీనారాయణ, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, ఎంఈవో చిట్టిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగభూషణ్‌రెడ్డి, మైలవరం హెచ్‌ఎం విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఎంపీడీవో రమణారెడ్డి, పోరుమామిళ్ల, రంగసముద్రం సర్పంచ్‌లు యనమల సుధాకర్, చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రగతి విద్యా స్కాలర్‌షిప్‌లు పంపిణీ



స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేస్తున్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ సిబ్బంది

జమ్మలమడుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మార్కెట్‌శాఖ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి ప్రగతి స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం మంచి మార్కులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు వి.మేఘన, బి.నిత్యశ్రీ, ఆర్.జెర్సీలకు జీరోబ్యాలెన్స్ అకౌంట్లు చేయించి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున వారి వారి ఖాతాల్లో జమ చేసి పాస్‌బుక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వేదవతి, ఉపాధ్యాయులు పద్మభూషణ్, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు తొగటవీర క్షత్రియవిద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

జమ్మలమడుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తొగటవీర క్షత్రియ సంక్షేమసంఘం జమ్మలమడుగు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని మండలాల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు 5వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు నాగులకట్టవీధి శ్రీ చౌడేశ్వరీదేవి కల్యాణ మండపంలో ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమసంఘం అధ్యక్షుడు మద్దకం ధనుంజయ తెలిపారు. శనివారం జమ్మలమడుగులోని నాగులకట్ట చౌడేశ్వరీదేవాలయం వద్ద ఆయన మాట్లాడారు. అర్హులైన వారు ఉపకార వేతనాలు అందుకోవాలని వారు కోరారు.

గోకులాల తనిఖీ

పోరుమామిళ్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నిర్మించిన గోకులాలను డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి పరిశీలించారు. శనివారం ఆయన మండలంలో జరిగిన సిమెంటు రోడ్ల నిర్మాణాలు, గోకులాలను పరిశీలించారు. అలాగే సిద్దవరంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సులో కూడా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏపీడీ రవిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీవో కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలను వేగవంతం చేయాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్టీవో కార్యాలయంలో ఆన్‌లైన్ సేవలు వేగవంతం చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు హరి పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు చెందిన వాహనదారులు తమ వాహనాల కేవైసీ, రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నా ఆన్‌లైన్ సేవలు ఆటంకంగా మారాయన్నారు. దూర ప్రాంతాలకు చెందినవారు మరోసారి ఆర్టీవో కార్యాలయానికి రావాల్సి వస్తుందన్నారు.

'ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం'

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అన్ని రకాల ఉత్తర్వులను తెలుగు భాషలో వెలువరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం హర్షణీయమని రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంకాల్‌కొండయ్య పేర్కొన్నారు. భాషలు బతికి బట్ట కట్టాలంటే ప్రభుత్వం చేతిలోనే ఉందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అన్ని ప్రభుత్వ ఉత్తర్వులను మాతృభాషలో ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు.

పర్లపాడు అంగన్వాడీసెంటరులో ఈసీసీ డే

రాజుపాలెం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పర్లపాడు అంగన్వాడీ కేంద్రంలో శనివారం ఎర్లి చైల్డ్ అండ్ కేర్ ఎడ్యుకేషన్ అనే కార్యక్రమాన్ని సీడీపీవో అరుణకుమారి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు అంకెలతో కూడిన బొమ్మలను ఆటపాటలను తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఇలా బొమ్మలను వాటిని చూపించడం ద్వారా పిల్లల్లో నైపుణ్యత పెరగడం, వాటిని గుర్తించుకోవడంలో సులభతరమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు,అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తెలుగునాడు డైరీ ఆవిష్కరణ

ఎర్రగుంట్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం 2025 నూతన సంవత్సర డైరీని టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి ఎర్రగుంట్ల టీడీపీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం ఆర్టీపీపీ నాయకులు బి.మనోహర్, సివి.వీరారెడ్డి, జి.మల్లేసుడు, హెచ్‌వీ.సుబ్బయ్య, జగదీష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బోగస్ పింఛన్ల ఏరివేత

కొండాపురం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో బోగస్ పింఛన్ల ఏరివేత ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం అవుతుందని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. మొదటగా మంచానికే పరిమితమై రూ.15000 తీసుకుంటూ, అదేవిధంగా కిడ్నీ తదితర వ్యాధులతో బాధపడుతూ రూ.10,000 తీసుకుంటున్న పింఛన్‌దారులను ప్రత్యేకంగా నియమించిన మెడికల్ సిబ్బంది ఇంటింటికి వెళ్లి తనిఖీలు నిర్వహిస్తా రన్నారు. అనంతరం వికలాంగుల కోటలో రూ.6000 తీసుకుంటున్న పింఛన్‌దారులను దగ్గరలోని ఆసుపత్రికి పిలిపించి పరీక్షలు నిర్వహించి తనిఖీలు చేస్తారన్నారు. కాగా మండలంలో రూ.15,000, రూ.10,000 తీసుకుంటున్న పింఛన్‌దారులు 33 మంది ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి వేడుకలు

జమ్మలమడుగు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ఈడిగపేట జడ్పీహైస్కూలులో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు అంధ ఉపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డికి ఘనంగా సన్మానం చేశారు. ఈసందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

లార్వా దశలోనే దోమలను అరికట్టాలి



మురుగు కాలువలో ఆయిల్ బాల్స్‌ను వేస్తున్న సిబ్బంది

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు దోమల నిర్మూలన లార్వాదశలోనే సాధ్యమవుతుందని మలేరియా సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని కామనూరు పీహెచ్‌సీ పరిధిలో ఉన్న నీటి నిలువలు, మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్‌ను కలిపారు. పీహెచ్‌సీ పరిధిలోని నరసింహాపురం, పెద్దశెట్టిపల్లె, దొరసానిపల్లె ప్రాంతాల్లో ఒక్కోచోట 10 చొప్పున మొత్తం 40 బాల్స్‌ను కలిపారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ తేజ, సూపర్‌వైజర్, డి.ఎ.వరప్రసాద్, కొత్తపల్లె పంచాయతీ కార్యదర్శి మస్తాన్, ఏఎన్‌ఎం ప్రమీల, ఆశా వర్కర్ మేరీ, వైద్యసిబ్బంది రాముడు, పాల్గొన్నారు.

ముగిసిన చేపల వేలం పాట

ముద్దనూరు జనవరి4(ఆంధ్రజ్యోతి): మండల పరిధి ఉప్పలూరు గ్రామ సమీపంలోని వామికొండ జలాశయంలో చేపలు పట్టుకునేందుకు కొలవలి సచివాలయంలో శనివారం మత్స్య శాఖ అధికారులు వేలం పాట నిర్వహించారు.6నెలల కాలపరిమితికి గాను సర్కారు వారి పాట రూ.1,59,200 నిర్వహించగా కొలవలి మాజీ సర్పంచ్ తులశయ్య 1,60,000 దక్కించుకున్నట్లు మైలవరం మత్స్యశాఖ ఎఫ్‌డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ అధికారులు మల్లేశ్వరి, నరసింహులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

బ్రహ్మంగారిమఠం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బ్రహ్మంగారిమఠం మండల అభివృద్ధికి మండల స్థాయి అధికారులు కృషి చేయాలని ఎంపీపీ వీరనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల ప్రజాపరిషత్ సభాభవనంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీడీవో వెంగమునిరెడ్డి పర్యవేక్షణలో ఎంపీపీ వీరనారాయణరెడ్డి అధ్యక్షతన సమావేశాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు అందించే విధంగా అధికారులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఈవోపీఆర్‌డీ రంగయ్య, ఏవో మల్లికార్జున రావు, ఎంఈవో పుల్లయ్య, ఏవో నిత్యానంద్, ఏఓ మల్లికార్జున, ఏపీవో హరిక్రిష్ణ, వెలుగు సీసీ బాలయ్య, సచివాలయ పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహుడికి ప్రత్యేక పూజలు



బద్వేలు రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని వల్లెలవారిపల్లెలో వెలసిన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అలంకారంతో పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భం గా ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని స్వామివారికి తిరుకళ్యాణ మహోత్సవం, వైకుంఠద్వార దర్శనం, ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. స్వామివారికల్యాణం అనంతరం ముత్యాల తలంబ్రాలను కూడా భక్తులు స్వీకరించాలని వారు కోరారు. అనంతరం శనివారం స్వామివారికి పంచలోహంతో చేసిన తొడుగు(కవచం) అమరుస్తు న్నామని, ఈ కార్యక్రమాల్లో భక్తులు అధికసంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. అనంతరం మధ్యాహ్నం అట్లూరు గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేరాలను అరికట్టడమే పోలీసుల ప్రధాన కర్తవ్యం

భక్తవత్సలం,డీఎస్పీ, ప్రొద్దుటూరు

ముఖాముఖి



ప్రొద్దుటూరు జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అసాంఘిక నేరాలను అరికట్టడమే పోలీసుల ప్రధాన కర్తవ్యం. రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధ న్యాయ పాలనను అనుసరించి పౌర సమాజం నడుచుకుండేలా పోలీసులు విధినిర్వహణ చేయాలని, ఆ వ్యవస్థ పట్ల ప్రజల్లో నమ్మకం, గౌరవం పెంచడానికి ప్రతి పోలీసు నిజాయితీగా పనిచేయాలని ఆ దిశగా పాటుపడతానని ప్రొద్దుటూరు డీఎస్పీ మోహూరి భక్తవత్సలం తెలిపారు. పసిడిపురిగా పేరుగాంచి వాణిజ్యంలో సెకండ్ బాంబేగా ఆధ్యాత్మికంలో రెండో మైసూరుగా పేరు ప్రఖ్యాతులున్న ప్రొద్దుటూరులో నాణేనికి రెండోవైపు కూడా వుంది. మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్, భూ మాఫియా, రేషన్ మాఫియాలాంటి అసాంఘిక నేరాలకు అడ్డాగా కొన్నేళ్ళుగా రాష్ట్రంలో పేరుగాంచింది.ఇక్కడ అసాంఘిక నేరాలను అదుపు చేసి శాంతి భద్రతలను కాపాడటమే లక్ష్యంగా ముందుకు వెళతాం. ఇందులో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్ళలకు తలొగ్గేదిలేదని చెబుతున్నారు డీఎస్పీ భక్తవత్సలం.ఆయనతో ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ....

ప్రశ్న : ప్రొద్దుటూరు డీఎస్పీగా మీరు ఎప్పుడు బాధ్యతలు తీసుకున్నారు ?

జవాబు : గత ఏడాది ఆగస్టు 14న డీఎస్పీగా బాధ్యతలు తీసుకున్నాను.

ప్రశ్న: గతంలో జిల్లాలో ఎక్కడ పనిచేశారు?

జవాబు: కడపలో ట్రాఫిక్ డీఎస్పీగా 2014 నుంచి 2017 వరకు పనిచేశా. ఆక్రమంలో కొద్ది రోజులు ప్రొద్దుటూరు ఇన్‌చార్జ్ డీఎస్పీగా కూడా వున్నాను.

ప్రశ్న: ప్రొద్దుటూరులో అసాంఘిక నేరాలను అదుపు చేయడానికి మీరు తీసుకున్న చర్యలు ఏమిటి ?

జవాబు : ప్రొద్దుటూరులో మట్కా, గుట్కా, క్రికెట్ బెట్టింగ్ గ్యాంబ్లింగ్‌లను పూర్తిగా రూపుమాపలేకపోయినా వీటిని సమర్థవంతంగా అరికడుతున్నాం. ఇందులో ఎంతటి వారున్న కేసులు పెడుతున్నాం. కౌన్సిలింగ్ ఇచ్చి తహసీల్దారు వద్ద బైండోవర్ చేస్తున్నాం. కొందరిని ఏకంగా నగర బహిష్కరణకు ప్రతిపాదనలు పెట్టాం. అసాంఘిక నేరాలపట్ల కఠినంగా వుంటున్నాం.ప్రజల సహకారం కూడా తోడుగా వుంటే మరింత నిబద్ధతతో పనిచేస్తాం.

ప్రశ్న : కడప ట్రాఫిక్ డీఎస్పీగా పని చేసిన అనుభవంతో ప్రొద్దుటూరు ట్రాఫిక్ సమస్యపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

జవాబు : ప్రొద్దుటూరు ఖ్యాతి గొప్పది. ఊరు చిన్నది. అత్యధిక జనసాంద్రత గల పట్టణం. మాస్టర్ ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తరణ జరగలేదు. ప్రధానంగా పార్కింగ్ ప్రదేశాలు లేవు. దీంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుదల చేస్తారు. ఫుట్‌పాత్‌లు ఆక్రమణలో వున్నాయి. మున్సిపాలిటీ ప్రత్యేక పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేస్తే ట్రాఫిక్‌ను కొంత మేర నియంత్రించగలం. కొన్ని ట్రాఫిక్ సర్కిల్స్‌లో సిగ్నల్స్ పనిచేయడం లేదు. మున్సిపాలిటీ వాటిని మరమ్మతులు చేయించాలి. సీసీ కెమెరాలు సైతం పూర్తి స్థాయిలో లేవు. వాటిని ఏర్పాటు చేయాల్సివుంది. ట్రాఫిక్ నియంత్రణకు మొబైల్ పోలీసు పార్టీలు తిప్పుతున్నాం. బీట్‌లు కూడా పర్యవేక్షిస్తున్నాం.

ప్రశ్న: ఫ్రెండ్లీ పోలీసు పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : సమస్యతో పోలీసు స్టేషన్‌కు వచ్చిన వాళ్లతో గౌరవమిచ్చి మాట్లాడాలి. ఓర్పుతో సమాధానం ఇచ్చేలా పోలీసులకు సూచిస్తున్నాం. సమస్య పోలీసు పరిధిలోనిది కాకున్నా ఇది ప్రభుత్వ కార్యాలయం కాబట్టి ఎక్కడ ఏ కార్యాలయంలో ఏ అధికారి ద్వారా సమస్య పరిష్కారమౌతుందో తెలియజేసేలా పోలీసులకు తర్ఫీదు ఇచ్చాం.

ప్రశ్న: మీ మీద రాజకీయ ఒత్తిళ్ల ఏమైనా వున్నాయా ?

జవాబు : మా మీద ఎటువంటి రాజకీయ ఒత్తిళ్ల లేవు. చట్టప్రకారం పనిచేయాలని మాత్రమే చెబుతున్నారు.

ప్రశ్న: మీరు వచ్చినప్పటి నుంచి రాజకీయ ఘర్షణలు జరిగాయా ?

జవాబు : జరగలేదు.ఒకవేళ జరిగినా అవి వ్యక్తి గతంగా జరిగిన సంఘటనలు వుండవచ్చు.

ప్రశ్న: దొంగతనాలు అరికట్టడంలో తీసుకుంటున్న చర్యలు ఏవి?

జవాబు : ప్రొద్దుటూరులో నేను వచ్చిన నాలుగు నెలలపైగా కాలంలో పెద్దగా దొంగతనాలు జరుగలేదు. ముందుస్తు చర్యలుగా బ్లూకోట్ టీంలను బలోపేతం చేస్తూ రెగ్యులేట్ చేశాం. నైట్‌పెట్రోలింగ్ పెంచాం. ప్రతి స్టేషన్ పరిధిలో ఆఫీసర్ నైట్ డ్యూటీ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. పాత నేరస్థుల మీద నిరంతర నిఘా పెట్టాం. ఎప్పటి కప్పుడు వారికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

ప్రశ్న: ఈవ్‌టీజింగ్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

జవాబు : ఈవ్‌టీజింగ్ జరిగే కొన్ని కాలేజీ ప్రాంతాలను గుర్తించాం. విద్యార్థినులు కాలేజీకి పోయి వచ్చేటప్పుడు పోలీస్ వాచింగ్ పెట్టాం. ఈవ్‌టీజింగ్ చేసిన వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం.

ప్రశ్న : గంజాయి, బియ్యం స్మగ్లింగ్ యాక్టివిటీలపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు : గంజాయి స్మగ్లర్స్ కాలేజీల దగ్గర యూత్‌ను టార్గెట్ చేస్తున్నారు.వారు కొంత గంజాయి మత్తుకు అలవాటు పడినవారు వున్నారు. వారికి గట్టిగా కౌన్సిలింగ్ ఇచ్చాం. గంజాయి స్మగ్లర్స్ ను గుర్తించి వారిపై కేసులు పెట్టాం.

ప్రశ్న: పోలీసు స్టేషన్లో కొందరు అధికారులు సిబ్బంది లంచాలు తీసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి? వాటి మీద ఎలాంటి చర్యలు తీసుకుంటున్నార?

జవాబు : పోలీసు స్టేషన్లలో ఏ అధికారి సిబ్బంది లంచాలు డిమాండ్‌చేస్తే మా దృష్టికి తీసుకురండి.ఇప్పటి వరకు అలాంటి ఫిర్యాదులు నా దృష్టికి రాలేదు. సరైన ఆధారాలతో ఫిర్యాదులు తీసుకు వస్తే తప్పకుండా సంబంధిత పోలీసు అధికారిపై కానీ సిబ్బందిపై గానీ చట్టపరంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటాం.

స్వామి వివేకానందుని అడుగుజాడలలో నడవాలి

బద్వేలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామకృష్ణ మిషన్, శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రాచపూడి నాగభూషణం డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులకు కళాశాలలో యువ-జాగృతి, వివేకానందుని పిలుపు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణ మిషన్ స్వామి అనుపమానంద జీ మహరాజ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ యువత వివేకానందుడి అడుగుజాడలలో నడవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలనాధికారి రాచపూడి వెంకట సాయిక్రిష్ణ, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, రామక్రిష్ణ మఠం కడప వలంటీర్ చలపతి, బద్వేలు విభాగం అమరేంద్రనాథ్, అంకయ్య, శశిధర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న స్వామిజీ

స్థల విషయమై ఘర్షణ

పోలీసుల రంగప్రవేశంతో సద్దుమణిగిన వైనం

బ్రహ్మంగారిమఠం, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) :బ్రహ్మంగారిమఠంలో ఓ స్థలం విషయమై ఘర్షణ వాతావరణం శనివారం రాత్రి చోటు చేసుకుంది. మఠంలోని ఐదు రోడ్ల కూడలిలో జమ్మిచెట్టు అరుగుల వద్ద నున్న స్థలం గత కొన్ని సంవత్సరాలుగా వివాదంలో ఉంది. గతంలో ఇది తమ స్థలమని, దీనిని దేవస్థానానికి రాసి ఇచ్చామని మండలంలోని మద్దిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు చెప్పుకుంటూ వచ్చేవారు. గతంలో స్థలాన్ని కొనుగోలు చేశానని బీమఠంలో ఉన్న ఓ వ్యక్తి తమకు కోర్టు ద్వారా ఆర్డర్ వచ్చిందంటూ స్థలాన్ని చదును చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా శనివారం రాత్రి జమ్మలమడుగు ప్రాంతం నుంచి ఆ స్థలం మాదంటూ రెండు వాహనాల్లో మనుషులు మఠంలో ఘర్షణ చేయడానికి వచ్చిన వ్యక్తులుగా స్థానికులు గమనించారు. దీంతో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనస్థలానికి చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

దువ్వూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సోమవారం మండల పరిషత్ కార్యాలయ సభాభవనంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణయ్య తెలిపారు. మండల పరిషత్ అధ్యక్షురాలు ఆధ్వర్యంలో సమావేశాన్ని జరుపుతామని చెప్పారు. మండల శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.